www.mahinewsindia.com

# మహా న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహా న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహా న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 198 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజిలు : 8 | వెల రూ. 2 | ఆదివారం -18 - అక్టోబర్ - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ.. జనసేన తొలి జాబితా విడుదల

ఏలూరు : రెడ్డి అప్పలనాయుడు,
మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులు,
అమలాపురం: నల్లా శ్రీధర్,

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ తొలి జాబితాను విడుదల చేసింది. మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల తొలి జాబితాను వెల్లడించింది. విజయవాడ మేయర్ జనసేన అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరును ప్రకటించింది.

మేయర్ అభ్యర్థులు

విజయవాడ: వంగవీటి రాధాకృష్ణ, ఏలూరు : రెడ్డి అప్పలనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులు, అమలాపురం: నల్లా శ్రీధర్, చిలకలూరిపేట : తోట రాజేశ్వరి, గొల్లప్రోలు : కడారి తమ్మయ్యనాయుడు, నరసాపురం : కొత్తపల్లి శైలజ, నిడదవోలు : కల్లం జ్యోతి, పెడన: మట్టా శివపావని, పిఠాపురం: బీరా విజయ్ శేఖర్, పుత్తూరు: డి. ఏలుమలై, సాలూరు: గొర్లె విజయకుమారి, సామర్లకోట: పిట్టా జానకి రామారావు, తెనాలి: టి. వెంకటరమణారావు, తిరువూరు: పి.మాధవి.

## ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల కోసం

# టీడీపీ నుంచి మరో జాబితా

### మొత్తం 22 మంది అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించిన పార్టీ

- ★ మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు
- ★ మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదా పేరు ఖరారు
- ★ జాబితాలో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ అభ్యర్థులు
- ★ తొలి జాబితాలో ఇప్పటికే 36 మందిని ప్రకటించిన టీడీపీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 22 మందితో కూడిన రెండో జాబితాను శనివారం అధికారికంగా విడుదల చేసింది. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థితో పాటు 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను ఈ జాబితాలో ఖరారు చేసింది. పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఈ ప్రకటన వెలువడింది. ఇటీవలే 36 మందితో మిగతా 2 లో

## రాజధాని అమరావతి నిర్మాణానికి ఇవ్వనున్న ప్రపంచబ్యాంకు - ఏడీబీ




### మరో రూ.15వేల కోట్ల రుణం

- రాజధానిలో మొత్తం రూ.1,00,912 కోట్లతో 141 ప్రాజెక్టులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ ప్రణాళికలు సిద్ధం
- ఆ నిధులను 2031 వరకు దశల వారీగా విడుదల
- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ఇప్పటికే తొలి విడతలో రూ.15 వేల కోట్లు మంజూరు
- రాజధానిలో ఇప్పటికే రూ.52,362.44 కోట్ల విలువైన 102 పనులు

## భారీ సాయం కోసం భారత్‌కు నేపాల్.. బలేన్ షా టూర్‌పై ఆసక్తి




- బాలేంద్ర షా నవంబరు 22 లేదా 23న భారత్‌కు వచ్చే అవకాశం
- పునర్నిర్మాణానికి భారీ ఆర్థిక సాయం కోరుతున్న నేపాల్
- సరిహద్దు వివాదాలు, వాణిజ్య ఒప్పందంపై చర్చలు
- మూడు కొత్త విమాన ప్రవేశ మార్గాలకు అనుమతి కోరుతున్న నేపాల్
- మూడు ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం




## ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపర్లే కావాలి..

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి: డీఎంకే కీలక తీర్మానాలు

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రద్దు చేయాలని తీర్మానం
- ఎన్నికల అవకతవకలపై రాష్ట్రపతికి ఫిర్యాదు నిర్ణయం
- కాంగ్రెస్, టీవీకే పార్టీలది ద్వంద్వ వైఖరి అంటూ డీఎంకే విమర్శలు




## ఘోర బస్సు ప్రమాదం.. లోయలో పడిన వాహనం, 8 మంది మృతి!

రాజస్థాన్‌లో బస్సు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి
మృతుల్లో ఐదుగురు మహిళలు, మరో 17 మందికి గాయాలు
భోపాల్ నుంచి ఖాటూ శ్యామ్‌కు వెళ్తుండగా ప్రమాదం

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

### టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల

టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



అమరావతి: టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, మిగతా 2 లో

## తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర.. చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

### తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ

- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ
- గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం
- తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, మిగతా 2 లో




## కష్టకాలంలో రైతు కూలీలకు రూ.12 వేల హామీ నెరవేర్చాలి

- వచ్చే 8 నెలలు వర్షాలు లేవని తెలుస్తున్న నేపథ్యంలో ఇకనైనా వెంటనే మరమ్మతులు చేయించాలి
- ఉపాధి పనుల కోసం దూరప్రాంతాలకు వెళ్తున్న రైతు కూలీలు రోడ్డుప్రమాదాల్లో మరణిస్తున్నారు
- "ఉపాధి హామీలో పని దినాలు పెంచడం కోసం ఇప్పుడు కమిటీ వేస్తే కేంద్రానికి నివేదిక ఎప్పుడు ఇస్తారు
- అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావొస్తున్నా మేడిగడ్డ బ్యారేజీకి ఇంకా మరమ్మతులు చేయలేదు
- కల్వకుంట్ల కవిత డిమాండ్

## ఇది కాలం తెచ్చిన కరువు కాదు,

# కాంగ్రెస్ తెచ్చిన కరువు

### 76 రోజుల పాటు కుంభకర్ణ నిద్రపోయింది రేవంత్ సర్కారు'

- సింగరేణి కుంభకోణంపై దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు: సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్
- మీడియా ముందు మాట్లాడుడు కాదు...బొగ్గు అంతంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు
- 'నీ బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన రూ.10 వేల కోట్ల కుంభకోణంపై విచారణకి ఆదేశించు
- ఆంధ్రాలో 700 కిలోమీటర్ల కిందిదాకా నీళ్లు తీసుకుపోతున్నారు
- 70 కిలోమీటర్ల దూరమున్న మహబూబ్‌నగర్‌కి కూడా నీళ్లు తీసుకుపోలేకపోతున్నాడు



హైదరాబాద్: ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు, అని ఎందుకు అంటున్నామో తెలుసా? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు.'ఒక్కసారి గర్జిస్తున్న ఈ బాహుబలి పంపులు చూడండి. కేసీఆర్ నిర్మించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ పంప్‌హౌస్‌లో ఉన్న 145 మెగావాట్ల పంపులు ఇవి. ప్రపంచంలో ఇంత పెద్ద ఇరిగేషన్ పంపులు మరెక్కడా లేవు. కృష్ణా నది మీదున్న శ్రీశైలం జలాశయానికి ఈ ఏడాది జూలై 29న ఇన్‌ఫ్లోలు ప్రారంభమయ్యాయి. కానీ 76 రోజుల పాటు కుంభకర్ణ నిద్రపోయింది మిగతా 2 లో



## విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

- గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చాలా చలి ఉండేది
- ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణం ఉంది
- చలి నుంచి రక్షించుకునే రోజుల నుంచి వేడిమి నుంచి రక్షించుకునే రోజులు వచ్చాయి

హైదరాబాద్: ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ అవార్డుల వేడుకలో డిప్యూటీ సీఎం పాల్గొని పురస్కారాలు అందజేశారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చాలా చలి ఉండేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణం ఉందని గుర్తు చేశారు. చలి నుంచి రక్షించుకునే రోజుల నుంచి వేడిమి నుంచి రక్షించుకునే రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 20వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉందన్నారు.

# కష్టకాలంలో రైతు కూలీలకు రూ.12 వేల హామీ నెరవేర్చాలి

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా రైతు కూలీలకు ఏటా రూ.12 వేలను ఈ కష్టకాలంలోనైనా అందించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరవు పరిస్థితుల్లో ఉపాధి పనుల కోసం దూరప్రాంతాలకు వెళ్తున్న రైతు కూలీలు రోడ్డుప్రమాదాల్లో మరణిస్తున్నారని, ఇటీవల ఘటనలను దృష్టిలో పెట్టుకొని వారికి బీమా చేయించాలని కోరారు. హైదరాబాద్‌లో ఆమె మాట్లాడారు. "ఉపాధి హామీలో పని దినాలు పెంచడం కోసం ఇప్పుడు కమిటీ వేస్తే కేంద్రానికి నివేదిక ఎప్పుడు ఇస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావొస్తున్నా మేడిగడ్డ బ్యారేజీకి ఇంకా మరమ్మతులు చేయలేదు. వచ్చే 8 నెలలు వర్షాలు లేవని తెలుస్తున్న నేపథ్యంలో ఇకనైనా వెంటనే మరమ్మతులు చేయించాలి. కరవు రాబోతుందని నిపుణులు ముందే హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు' అని కవిత ఆక్షేపించారు.

## తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్: తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. నేడు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

## విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి

హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## పిల్లలకూ ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు.. పూర్తిగా దూరం చేయలేరు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

పిల్లలకు ఇంటర్నెట్ అందుబాటును పూర్తిగా నిరాకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌ను వినియోగించుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఆర్టికల్ 19(1)(ఛ) కింద ప్రాథమిక హక్కులతో ముడిపడి ఉందని పేర్కొంది. పిల్లల భద్రత పేరుతో వారిని పూర్తిగా ఇంటర్నెట్‌కు దూరం చేయడం సరికాదని తెలిపింది. పిల్లల రక్షణకు, వారి స్వేచ్ఛకు మధ్య వైరుధ్యం లేదని, రెండింటినీ కాపాడాల్సిన బాధ్యత ఉందని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా వేదికలు, ఇతర ఆన్‌లైన్ సేవల్లో పిల్లలపై లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించే వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేసే క్రమంలో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్‌లో భావప్రకటనా స్వేచ్ఛతో పాటు సమాచారాన్ని తెలుసుకునే, పొందే, ఇతరులతో పంచుకునే హక్కు కూడా ఇమిడి ఉందని వివరించింది. ఇంటర్నెట్ అనేది ఆలోచనలు, సృజనాత్మకత, సమాచార మార్పిడికి వేదిక అని పేర్కొంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు విద్య, సమాచారాన్ని పొందేందుకు ఇంటర్నెట్ ఒక్కటే ప్రధాన మార్గంగా ఉంటోందని తెలిపింది. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఇతరులతో పరిచయాలు పెంచుకోవడానికి, తమలాంటి పరిస్థితుల్లో ఉన్నవారితో అనుసంధానం కావడానికి కూడా ఆన్‌లైన్ వేదికలు ఉపయోగపడతాయని వివరించింది. ప్రస్తుతం ఇంటర్నెట్ పిల్లలకు పూర్తిగా సురక్షితమైన వేదిక కాదని అంగీకరించిన కోర్టు.. ఆ కారణంతో వారిని పూర్తిగా దూరం పెట్టడం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. పిల్లలు ఇంటర్నెట్ వాడకూడదని నిబంధనలు విధించినంత మాత్రాన వారు దాని వినియోగాన్ని ఆపరని, నియంత్రణ లేని వెబ్‌సైట్లు, వేదికలకు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ప్రలోభాలకు గురైన, బెదిరింపులు ఎదుర్కొంటున్న లేదా వేధింపులకు గురైన పిల్లలు ఇంటర్నెట్ వాడినందుకు తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో జరిగిన విషయాన్ని చెప్పకుండా ఉండొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించడం తగిన చర్య కాదని పేర్కొంది. పిల్లల వయసుకు తగిన భద్రతా చర్యలను కోర్టు వ్యతిరేకించలేదు. తల్లిదండ్రుల అనుమతి, మార్గదర్శకత్వం, పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పిల్లల ఖాతాలకు ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్' తీసుకురావడం, ఖాతాలను ముందుగానే ప్రైవేట్‌గా ఉంచడం, తెలియని పెద్దల నుంచి వచ్చే సందేశాలు, పరిచయాలను పరిమితం చేయడం, పిల్లలకు చూపించే ప్రకటనలు, కంటెంట్‌పై నియంత్రణ విధించడం వంటి చర్యలను ప్రస్తావించింది. వీటి అమలుపై తగిన విధానాలను రూపొందించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికి వదిలేసింది. పిల్లలకు హానికరమైన అడల్ట్ కంటెంట్ వెబ్‌సైట్ల వంటి నిర్దిష్ట సేవలపై ఆంక్షలు విధించేందుకు ఈ వ్యాఖ్యలు అడ్డంకి కాదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఆన్‌లైన్ వేదికల్లో పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు సమగ్ర జాతీయ డేటాబేస్ ఏర్పాటు సహా చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి: మోదీకి ఖర్గే లేఖ

ఢిల్లీ: కొత్త బిల్లులు, కీలక ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే వాటిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక వీగిపోయిన విషయాన్ని ఖర్గే తన లేఖలో గుర్తుచేశారు. దేశంపై తీవ్ర ప్రభావం చూపే ఇటువంటి రాజ్యాంగ సవరణ బిల్లులను మరోసారి పార్లమెంటులో ఏకపక్షంగా 'బుల్డోజ్' చేయవద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. అఖిలపక్ష సమావేశం కోసం తాను విజ్ఞప్తి చేయడం ఇది నాలుగోసారి అని ఖర్గే తెలిపారు. గతంలో ఏప్రిల్ 11, జులై 16, ఆగస్టు 27 తేదీల్లో కూడా సమావేశం నిర్వహించాలని తాను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు వాయిదా పడిన 64 రోజుల తర్వాత కూడా ఉభయ సభలను ఇంకా ప్రొరోగ్ చేయలేదని, గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని అని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 2026 ఏప్రిల్ 16న కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లుతో పాటు మరో రెండు బిల్లులు మరుసటి రోజే తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే.

## పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత




కడప: కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో పులివెందులలో ఒక్కసారిగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వివాదం మొదలైంది. పోలీసుల నిర్ణయంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గుంపును చెదరగొట్టి, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న తీవ్రమైన రాజకీయ పోటీయే ఈ ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. ఘటన అనంతరం పులివెందులలో భారీగా పోలీసులను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు

హైదరాబాద్: ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు, అని ఎందుకు అంటున్నామో తెలుసా? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు.'ఒక్కసారి గర్జిస్తున్న ఈ బాహుబలి పంపులు చూడండి. కేసీఆర్ నిర్మించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ పంప్‌హౌస్‌లో ఉన్న 145 మెగావాట్ల పంపులు ఇవి. ప్రపంచంలో ఇంత పెద్ద ఇరిగేషన్ పంపులు మరెక్కడా లేవు. కృష్ణా నది మీదున్న శ్రీశైలం జలాశయానికి ఈ ఏడాది జూలై 29న ఇన్‌ఫ్లోలు ప్రారంభమయ్యాయి. కానీ 76 రోజుల పాటు కుంభకర్ణ నిద్రపోయింది రేవంత్ సర్కారు'అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'అనేకసార్లు బీఆర్ఎస్ నాయకులు ఈ మోటార్లు ఆన్ చేయాలని డిమాండ్ చేస్తే మేల్కొని మొన్న నార్లాపూర్ పంప్‌హౌస్‌లో పంపింగ్ ప్రారంభించింది. ఈ సీజన్లో వరద వచ్చినప్పటి నుండి నేటి వరకు పంపింగ్ చేసి ఉంటే సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉండేది.

అంటే నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. కానీ కేవలం కేసీఆర్‌కి పేరు రావద్దు అన్న కుట్రతో ఇక్కడ నీటిని ఎత్తిపోయలేదు రేవంత్ ప్రభుత్వం!ఫలితంగానే ఇవ్వాళ తీవ్రమైన సాగునీటి కొరత ఎదుర్కొంటున్నారు తెలంగాణ రైతన్నలు'అని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే సింగరేణి కుంభకోణంపై, విదేశీ బొగ్గు కొనుగోళ్లపై సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు అని ఛాలెంజ్ విసిరారు. మీడియా ముందు మాట్లాడుడు కాదు...బొగ్గు అంశంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు అని సవాల్ విసిరారు. సింగరేణిలో కాంగ్రెస్ చేసిన కుంభకోణాలని ప్రజల ముందు పెడితే రేవంత్ రెడ్డి నిన్న అడ్డగోలుగా మాట్లాడిండు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'నీ బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన రూ.10 వేల కోట్ల కుంభకోణంపై విచారణకి ఆదేశించు.సింగరేణిలో నువ్వు చేసిన సోలార్ పవర్ కుంభకోణం బయటపెడతా. సింగరేణిని బొందపెట్టి, ఇప్పుడు 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని కాదని విదేశీ బొగ్గు తేవడానికి కుట్ర చేస్తున్నాడు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు 'గతంలో రాష్ట్రంలో 24 గంటల పాటు కరెంట్ పోకుండా అండగా నిలబడింది సింగరేణి. ఇప్పుడు అదే సింగరేణిని బద్నాం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. సింగరేణిలో రూ.3800కి టన్ను బొగ్గు దొరికితే అది వద్దు అని, విదేశాలలో రూ.12000 పెట్టి కమీషన్లు కొట్టడం కోసం బొగ్గు కొనాలని కుట్ర చేస్తున్నాడు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి పదవి రెన్యువల్ కాదు అని ఎద్దేవా చేశారు.'కరెంట్ సరఫరా వ్యవస్థను పండబెట్టి, ఇప్పుడు కొందామంటే కరెంట్ లేదు అని అబద్ధాలు చెబుతున్నాడు.ఒకనాడు 24 గంటల కరెంట్ వచ్చిన తెలంగాణలో ఇప్పుడు ఎందుకు రావడం లేదు?.

అప్పుడు మేము 3.90 రూపాయలకు కొంటే కుంభకోణం అన్నారు...ఇప్పుడు 15 రూపాయలు పెట్టి కొనాలని చూస్తున్న కాంగ్రెస్ తీరుని ఏమనాలి?. రేవంత్ రెడ్డి 1000 టీఎంసీల నీళ్లను సముద్రంలో వదిలిపెట్టిండు'అని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.'వృథాగా కిందికి పోయిన నీళ్లు ఎత్తిపోయకుండా ఇప్పుడు ఎల్ నినో పేరుతో చేతులెత్తేసిండు. ఆంధ్రాలో 700 కిలోమీటర్ల కిందిదాకా నీళ్లు తీసుకుపోతే, 70 కిలోమీటర్ల దూరమున్న మహబూబ్‌నగర్‌కి కూడా నీళ్లు తీసుకుపోలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు.

# ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల కోసం టీడీపీ నుంచి మరో జాబితా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 22 మందితో కూడిన రెండో జాబితాను శనివారం అధికారికంగా విడుదల చేసింది. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థితో పాటు 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను ఈ జాబితాలో ఖరారు చేసింది. పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఈ ప్రకటన వెలువడింది. ఇటీవలే 36 మందితో తొలి జాబితాను ప్రకటించిన టీడీపీ, తాజాగా రెండో జాబితాను విడుదల చేయడంతో ఎన్నికల బరిలో దూకుడు పెంచినట్లయింది. ఈ జాబితాలో కీలకమైన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను ఎంపిక చేసింది. క్షేత్రస్థాయిలో పార్టీ అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం ద్వారా వారికి ప్రచారానికి తగినంత సమయం ఇవ్వడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ రెండు జాబితాలతో కలిపి టీడీపీ ఇప్పటివరకు మొత్తం 58 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

### ఖరారైన అభ్యర్థుల పూర్తి జాబితా:

మున్సిపల్ కార్పొరేషన్ (1):
మచిలీపట్నం: షేక్ అబ్దుల్ అబిదా

### మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (21):

ఆకివీడు: నిలోఫర్ షేక్, బేతంచెర్ల: ఐ. లోకేశ్ గౌడ్, చీరాల: యెరిచర్ల హనీ స్పందన , బుచ్చిరెడ్డిపాలెం: దొడ్ల విజయలక్ష్మి, డోన్: కోట్ల సుజాతమ్మ , గుత్తి: గోవిందరాజులు తమిళ్ సెల్వి, గుంతకల్లు: యశోద, జంగారెడ్డిగూడెం: రొంగల అనుష, కదిరి: షేక్ సమీరా, కళ్యాణదుర్గం: బుట్న లక్ష్మి, కొండపల్లి: కన్నెకంటి అమూల్య, కొవ్వూరు: జొన్నలగడ్డ రాధారాణి, నాయుడుపేట: షకీరా, నందిగామ: శాకమూరి వంశీధర్, నందికొట్కూరు: ఈ.ఎం. సబురున్నిసా, నర్సీపట్నం: చింతకాయల పద్మావతి, ప్రొద్దుటూరు: నంద్యాల రాఘవరెడ్డి, వెంకటగిరి: దొంతు శారద, ఉయ్యూరు: చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్, ఏలేశ్వరం: యార్లగడ్డ అక్షిత , ఎమ్మిగనూరు: మాచాని సునీత. ఈ జాబితాలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మున్సిపాలిటీలకు అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అన్ని ప్రాంతాల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్నామనే సంకేతాలను పార్టీ పంపింది. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది.

## భారీ సాయం కోసం భారత్‌కు నేపాల్.. బలేన్ షా టూర్‌పై ఆసక్తి

ఢిల్లీ: నేపాల్ ప్రధాని బాలేంద్ర షా భారత్ పర్యటనకు సిద్ధమవుతున్నారు. నవంబరు 22 లేదా 23 తేదీన ఆయన న్యూఢిల్లీకి వచ్చే అవకాశముంది. ఈ పర్యటనలో భారత్ నుంచి భారీ ఆర్థిక సాయం పొందడమే ప్రధాన లక్ష్యంగా నేపాల్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో పాటు సరిహద్దు వివాదాలు, వాణిజ్యం, విమాన మార్గాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించాలని భావిస్తోంది. ఆగస్టు 26న నేపాల్‌లో వచ్చిన భారీ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దాదాపు 1,500 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 5,000 మందికి పైగా ఆచూకీ తెలియడం లేదు. రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పునర్నిర్మాణ పనుల కోసం భారత్ నుంచి భారీ సాయాన్ని నేపాల్ కోరుతోంది. తక్కువ షరతులతో నిధులు అందించాలని ఆశిస్తోంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియధురా ప్రాంతాలపై కొనసాగుతున్న వివాదాన్ని కూడా నేపాల్ ప్రస్తావించనున్నట్లు సమాచారం. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ముందుగానే సమీక్షించాలని కోరుతోంది. భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ధ్రువీకరణ నిబంధనల వల్ల తమ దేశ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతోంది. ప్రస్తుతం నేపాల్‌కు వచ్చే అంతర్జాతీయ విమానాల్లో ఎక్కువ శాతం సిమరా మార్గం మీదుగానే ప్రవేశిస్తున్నాయి. దీంతో రద్దీ పెరుగుతోంది. జనక్‌పూర్, భైరహవా, నేపాల్‌గంజ్ మీదుగా కొత్త విమాన ప్రవేశ మార్గాలకు అనుమతి ఇవ్వాలని నేపాల్ కోరుతోంది. భద్రతా కారణాలతో భారత్ ఈ ప్రతిపాదనపై ఆచితూచి వ్యవహరిస్తోంది. 750 మెగావాట్ల వెస్ట్ సేతి, 480 మెగావాట్ల ఫుకోట్ కర్ణాలి, 450 మెగావాట్ల సేతి రివర్-6 ప్రాజెక్టులపై చర్చించే అవకాశముంది. భారత్ సాయంతో నిర్మించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ పర్యటనలో ప్రారంభించనున్నారు. వరదల తర్వాత పునరుద్ధరణ పనులకు భారత్ గ్రాంట్లు, రాయితీ రుణాలు అందించాలని నేపాల్ కోరుతోంది.

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

అమరావతి: టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

## రాజధాని అమరావతి నిర్మాణానికి ఇవ్వనున్న ప్రపంచబ్యాంకు - ఏడీబీ

అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) మరో రూ.15 వేల కోట్ల రుణం మంజూరు చేయనున్నాయి. ఆ రెండు బ్యాంకులూ చెరో రూ.7,500 కోట్లు ఇస్తాయి. దీనికి సంబంధించిన అనుమతుల ప్రక్రియ తుది దశలో ఉంది. ఆ నిధులను 2031 వరకు దశల వారీగా విడుదల చేస్తాయి. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ఇప్పటికే తొలి విడతలో రూ.15 వేల కోట్లు మంజూరు చేశాయి. ఈ నిధులతో రాజధానిలో వివిధ పనులు జరుగుతున్నాయి. పనుల పురోగతిని బట్టి ఆ బ్యాంకులు దశల వారీగా నిధులు విడుదల చేస్తున్నాయి. 2029తో తొలి విడత ప్రాజెక్టు గడువు ముగుస్తుంది. ఆ రెండు బ్యాంకులతో పాటు వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకునే నిధులతో చేపట్టే పనుల పర్యవేక్షణకు ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీజీఎంసీ) సంస్థను నియమించేందుకు సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ప్రస్తుతం ఉన్న పీజీఎంసీ గడువు 2027 జనవరితో ముగియనుంది. దీంతో మరో ఏజెన్సీ నియామకానికి సీఆర్‌డీఏ తాజాగా టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజధానిలో ఇప్పటికే రూ.52,362.44 కోట్ల విలువైన 102 పనులు జరుగుతున్నట్టు తెలిపింది.

### కృష్ణా నదిపై రెండు బ్రిడ్జిలు

రాజధానిలో మొత్తం రూ.1,00,912 కోట్లతో 141 ప్రాజెక్టులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ ప్రణాళికలు సిద్ధం చేసింది. వాటిలో రూ.52,362 కోట్ల విలువైన పనులు ఇప్పటికే జరుగుతుండగా, రాబోయే రోజుల్లో మిగతా పనుల్ని దశల వారీగా చేపట్టనున్నట్టు సీఆర్‌డీఏ పేర్కొంది. ప్రధాన మౌలిక వసతులు, ప్రభుత్వ భవనాలు మినహా మిగతా ప్రాజెక్టులను పభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ), హైబ్రిడ్ యాన్యుటీ, డిజైన్-బిల్డ్-ఫైనాన్స్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ వంటి విధానాల్లో చేపట్టనుంది. ఆ ప్రాజెక్టుల్లో కృష్ణానదిపై అమరావతి-ఇబ్రహీంపట్నం మధ్య నిర్మించే ఐకానిక్ బ్రిడ్జి, ప్రకాశం బ్యారేజ్‌కు దిగువున నిర్మించే సిగ్నేచర్ బ్రిడ్జి కూడా ఉన్నాయి. సుమారు రూ.2,436 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఐకానిక్ బ్రిడ్జికి డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైంది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద 40 శాతం నిధులను సమకూరుస్తుంది. ప్రకాశం బ్యారేజ్‌కు దిగువున రూ.650 కోట్లతో సిగ్నేచర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. డీపీఆర్ తయారీకి త్వరలో కన్సల్టెంట్‌ను నియమించనున్నట్లు సీఆర్‌డీఏ పేర్కొంది.

## ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపర్లే కావాలి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

### డీఎంకే కీలక తీర్మానాలు

తమిళనాడు: డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా పట్టుబట్టారు. చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. వీటిలో ప్రధానంగా ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. ఆమోదించిన తీర్మానాల్లో మొదటిది.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు గురించే ఉంది. ఎన్నికల నిర్వహణలో ఆయన వైఫల్యం చెందారని ఆరోపిస్తూ ఈ డిమాండ్ చేశారు. అయితే, ఏ కారణాలతో ఆయన్ను తొలగించాలని కోరుతున్నారో లేదా ఎలాంటి నిర్దిష్ట అవకతవకలు జరిగాయో పార్టీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. ఈ అంశాలపై రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంలో పూర్తి వివరాలు పొందుపరచనున్నట్లు తెలుస్తోంది. రెండో తీర్మానంలో.. విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు డీఎంకే తన మద్దతు ప్రకటించింది. అయితే, ఏ విద్యార్థి సంఘాలు, ఏ డిమాండ్లతో ఆందోళనలు చేస్తున్నాయో ఆ తీర్మానంలో వెల్లడించలేదు. ఇక మూడో తీర్మానంలో.. కాంగ్రెస్, అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీల ద్వంద్వ వైఖరిని డీఎంకే ఖండించింది. ఏయే అంశాల్లో ఈ పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయో కూడా ప్రకటనలో వివరించలేదు. నాలుగో తీర్మానం ద్వారా తమ డిమాండ్లను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి, ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని కోరాలని పునరుద్ఘాటించారు. ఈ నిర్ణయాలతో డీఎంకే ఎన్నికల సంఘంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

## తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర.. చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

## ఘోర బస్సు ప్రమాదం.. లోయలో పడిన వాహనం, 8 మంది మృతి!



ఢిల్లీ: ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. రాజస్థాన్‌లోని కోటా సమీపంలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం.. బస్సులో 27 మంది ప్రయాణిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. డ్రైవర్ నిద్ర మత్తు వల్లే బస్సు అదుపు తప్పింది. రక్షణ కంచెను ఢీకొట్టి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో మరణించిన ఎనిమిది మందిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 17 మందిని కోటాలోని ఎంబీఎస్ ఆసుపత్రి, న్యూ మెడికల్ కాలేజీ ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఎవరి పరిస్థితీ విషమంగా లేదని అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం ఉదయం 8 గంటల సమయంలో అందినట్లు వెల్లడించారు. కోటా జిల్లా కలెక్టర్ పీయూష్ సమారియా, ఐజీ హరేంద్ర మహావర్ ఎంబీఎస్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అందుబాటులో ఉన్న నాలుగు అంబులెన్సులనూ ప్రమాద స్థలానికి పంపించారు. క్షతగాత్రులను వీలైనంత త్వరగా ఆసుపత్రులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# వేసవిలో చెరకు రసం తాగితే డీహైడ్రేషన్, ఎండ దెబ్బ రాకుండా ఆపవచ్చా..?



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నీంబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు.

### హైడ్రేషన్ జరుగుతుందా..

హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది. కానీ ఒక గ్లాస్ చెరకు రసంలో కేవలం 11-17 మిల్లీగ్రాముల సోడియం మాత్రమే ఉంటుంది. సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.

### అధికంగా చక్కెర..

ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. యంత్రాలు సరిగ్గా శుభ్రం చేస్తారని నమ్మకం ఉండదు. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.

### ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లు బెటర్..

అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం. దానికి నిమ్మరసం, కొంచెం ఉప్పు కలిపితే శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు అందుతాయి. శరీరంలో నీటిని నిల్వ ఉంచేలా సహాయపడే పానీయాలపై దృష్టి పెట్టడం అవసరం. చెరకు రసం తాగితే తక్షణంగా చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్ నివారణకు లేదా సరైన హైడ్రేషన్‌కు విశ్వసనీయ పరిష్కారం కాదు. తక్కువ సోడియం, ఎక్కువ చక్కెర, హైజీన్ సమస్యల కారణంగా దీన్ని అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. వేసవిలో సరైన హైడ్రేషన్ కోసం నిమ్మరసం, ఉప్పు కలిపిన నీరు వంటి సులభమైన పానీయాలు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# 60 రోజుల పాటు జంక్ ఫుడ్‌ను మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే..!



జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని చాలా మందికి తెలుసు. అయితే దాన్ని పూర్తిగా 60 రోజుల పాటు మానేస్తే శరీరంలో కనిపించని లోతైన మార్పులు జరుగుతాయి. ప్రాసెస్ చేసిన స్నాక్స్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్‌ను ఆపేసినప్పుడు శరీరం దెబ్బతిన్న వ్యవస్థలను మళ్లీ సరిచేసుకోవడం ప్రారంభిస్తుంది. తాజా పరిశోధనలు తెలిపిన ప్రకారం కొద్ది రోజులపాటు జంక్ ఫుడ్‌కు విరామం వల్ల ఆకలి నియంత్రణ, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం, మెటబాలిజం మెరుగుపడటానికి దోహదం చేస్తుందని వెల్లడైంది. మొదట కొన్ని వారాలు శుద్ధి దశలా ఉండగా, తర్వాత శక్తి స్థిరంగా మారుతుంది. 60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేస్తే శరీరంలో ఎటువంటి మార్పులు జరుగుతాయో వైద్యులు వివరిస్తున్నారు.

### అతిగా తినడం తగ్గుతుంది..

60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేయడం వల్ల ఆకలి హార్మోన్లు సమతుల్యం అవుతాయి. జంక్ ఫుడ్ వల్ల ఆకలి నియంత్రణ దెబ్బతింటుంది. దీనివల్ల ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. అయితే 60 రోజుల పాటు దాన్ని మానేస్తే లెప్టిన్, ఘ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు సరిగా పనిచేయడం ప్రారంభిస్తాయి. దాంతో తృప్తి భావం సరిగ్గా తెలుస్తుంది. అలాగే కాలరీలు సహజంగా తగ్గుతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గిస్తే రోజువారీ క్యాలరీలు కూడా ఆటోమేటిక్‌గా తగ్గుతాయి. దాంతో బరువు తగ్గడం, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడం, శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. జంక్‌ఫుడ్ మానేయడం వల్ల గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యం మెరుగుపడుతుంది. జంక్ ఫుడ్ గట్‌లో బ్యాక్టీరియా సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. దాన్ని మానేస్తే గట్ లైనింగ్ మళ్లీ బలపడుతుంది, మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభంగా మారుతుంది. అంతేకాకుండా శరీర మెటబాలిజం మెరుగవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించడం వల్ల మెటబాలిజం సరిగా పనిచేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీని వల్ల శరీరానికి అవసరమైన శక్తి సమర్థంగా ఉత్పత్తి అవుతుంది.

### మెదడు పనితీరుకు..

ఇక జంక్ ఫుడ్ మానేయడం వల్ల మెదడు పనితీరు కూడా మెరుగవుతుంది. జంక్ ఫుడ్ మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మెమొరీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. 60 రోజుల తర్వాత మెదడు మళ్లీ సరిగా స్పందించడం ప్రారంభించి, ఫోకస్ పెరుగుతుంది, అనవసరమైనవి తినాలనే కోరికలు తగ్గుతాయి. అంతేకాకుండా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గుతుంది. జంక్ ఫుడ్ వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బులు, ఇతర సమస్యలకు దారి తీస్తుంది. రెండు నెలలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, చర్మం మెరుగుపడటం, ఉబ్బరం తగ్గడం, కీళ్ల నొప్పులు తగ్గడం వంటి ప్రయోజనాలు కనిపిస్తాయి. 60 రోజులు జంక్ ఫుడ్ మానేయడం కొంచెం కష్టంగా అనిపించినా, శరీరం చాలా త్వరగా ధన్యవాదాలు చెబుతుందని, బయట కనిపించే మార్పుల కంటే లోపల జరిగే మార్పులే ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనవని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పచ్చి మామిడి వర్సెస్ మామిడి పండు.. ఏయే పదార్థాల తయారీకి వేటిని వాడాలి..



మామిడి సీజన్ ప్రారంభమైతే మార్కెట్లు పచ్చి మామిడిపండ్ల నుంచి పండిన తీయని మామిడిపండ్లతో నిండిపోతాయి. ప్రతి ఒక్కరు వారికి నచ్చినవి కొనుగోలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ ఉంటారు. ఈ రెండింటికీ ప్రత్యేకమైన రుచి ఉండడంతోపాటు వంటల్లో వీటి ఉపయోగం కూడా వేరుగా ఉంటుంది. పచ్చి మామిడి తియ్యని, పులుపు రుచిని అందిస్తే, పండిన మామిడి సహజమైన తీపి, మృదుత్వాన్ని అందిస్తుంది. అందువల్ల వీటిని ఒకే పండుగా కాకుండా, వేర్వేరు పదార్థాలుగా చూడటం ఉత్తమం. పచ్చి మామిడి ప్రధానంగా పులుపు, కరకరలాడే టెక్స్చర్‌తో ఉంటుంది. అందుకే వంటల్లో తాజాదనాన్ని తీసుకురావడానికి ఇది ఉపయోగపడుతుంది. వేసవిలో పచ్చి మామిడి ఉల్లాసాన్ని పెంచే రుచిని అందిస్తుంది. పచ్చి మామిడితో చేసే వంటల్లో ఆవకాయలు, పచ్చళ్ళు ముఖ్యమైనవి. కాయ గట్టిగా ఉండటం వల్ల మసాలాలు, నూనె కలిసిపోతాయి. పచ్చి మామిడి చట్నీలు కూడా భోజనానికి రుచిని పెంచుతాయి.

### ఆమ్ పన్నా ఆరోగ్యకరం..

సలాడ్లు, కచుంబర్‌లలో తురిమిన పచ్చి మామిడి కలిపితే రుచిలో ప్రత్యేకమైన మార్పు వస్తుంది. క్యారెట్, కీరదోసకాయ, పల్లీలు వంటి పదార్థాలతో కలిపితే కరకరలాడే, రుచికరమైన మిశ్రమంగా మారుతుంది. దాల్, కర్రీలలో కూడా పచ్చి మామిడి ఉపయోగిస్తారు. ఇది వంటకానికి తేలికపాటి పులుపును అందించి, రుచిని సమతుల్యం చేస్తుంది. కొబ్బరి ఆధారిత కర్రీల్లో ఇది తేలికపాటి తీపి-పులుపు సమతుల్యతను కలిగిస్తుంది. అలాగే వేసవిలో పచ్చి మామిడితో చేసే పానీయాల్లో ఆమ్ పన్నా ముఖ్యమైనది. ఇది శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు తక్షణ శక్తిని అందిస్తుంది. బెల్లం, మసాలాలు కలిపి తయారు చేసే ఈ పానీయం వేసవిలో ప్రత్యేకమైన ఉపశమనాన్ని ఇస్తుంది.

### అల్పాహారంగా పనిచేసే మామిడి పండ్లు..

ఇక పండిన మామిడి తీపి, సువాసన, మృదుత్వంతో వంటల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీన్ని డెజర్ట్‌లలోనూ, పానీయాల్లోనూ విస్తృతంగా ఉపయోగిస్తారు. శ్రీఖండ్, కలాకండ్ వంటి మిఠాయిల్లో పండిన మామిడి అద్భుతంగా సరిపోతుంది. మామిడిని క్రీమ్‌తో కలిపినా, కేకులు, మఫిన్స్‌ల్లో వాడినా ప్రత్యేకమైన రుచి ఇస్తుంది. స్మూతీలు, లస్సీలు, బౌల్స్‌లో పండిన మామిడి గట్టిగా, క్రీమీ టెక్స్చర్‌ను ఇస్తుంది. పెరుగు, పాలు లేదా కొబ్బరితో కలిపి తీసుకుంటే పోషకాహారంగా ఉంటుంది. ఇవి వేసవిలో త్వరగా తయారయ్యే అల్పాహారంగా కూడా ఉపయోగపడతాయి. పండిన మామిడితో సాల్సాలు, టాపింగ్స్ కూడా తయారు చేయవచ్చు. ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మరసం, మిరపకాయలతో కలిపితే తీపి-కారం సమతుల్యతతో వంటకానికి కొత్త రుచిని అందిస్తుంది. కొన్ని ప్రాంతీయ కర్రీల్లో కూడా పండిన మామిడి వాడతారు. బెంగాలీ, గోవా వంటల్లో ఇది మసాలాలతో కలిసిపోతూ తేలికపాటి తీపి రుచిని ఇస్తుంది. పచ్చి మామిడి ఉత్సాహం, పులుపు, కరకరలాడే గుణాన్ని ఇస్తే, పండిన మామిడి తీపి, మృదుత్వం, సంతృప్తిని అందిస్తుంది. వంటకానికి అవసరాన్ని బట్టి వీటిని ఎంచుకుంటే ప్రతి వంటకాన్ని ప్రత్యేకంగా మార్చుకోవచ్చు. వేసవి కాలంలో ఈ రెండు రకాల మామిళ్లతో ఎన్నో రుచికరమైన వంటకాలు సిద్ధం చేసుకోవచ్చు.

# ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక

**ప్రకృతి సేద్య పద్ధతులపై ప్రామాణిక శిక్షణా మాన్యువల్‌ను వెలువరించిన నీతి ఆయోగ్**

**22 రకాల పంటల్లో ప్రకృతి సేద్య పద్ధతులపై పూర్తి సమాచారం**

**రసాయనిక-సేంద్రియ-ప్రకృతి సేద్యాల మధ్య వ్యత్యాసాలపైనా వివరణ**



ప్రకృతి వ్యవసాయాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా వ్యాప్తిలోకి తేవాలన్న లక్ష్యంతో సమగ్రమైన ట్రైనింగ్ మాన్యువల్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ ఇటీవలే వెలువరించింది. 'రైతులకు సాధికారత కల్పించటం: ప్రకృతి వ్యవసాయ శిక్షణా కిట్ -- ఉత్తమ పద్ధతుల మార్గదర్శిని' పేరుతో రూపొందించారు. ప్రకృతి సేద్య మూల సూత్రాలతో పాటు.. ముఖ్యమైన 22 రకాల పంటల సాగులో క్షేత్రస్థాయిలో ఆచరించదగిన ప్రామాణిక ప్రకృతి సేద్య పద్ధతులను పొందుపరిచారు. నీతి ఆయోగ్ వ్యవసాయం--సాంకేతిక విజ్ఞాన విభాగం ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలం పటేల్, కన్సల్టెంట్ పరెమల్ బనఫర్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం దీన్ని రూపొందించింది. రైతులు, విస్తరణ సిబ్బంది, విధాన నిర్ణేతలకు సుస్థిర వ్యవసాయ విస్తరణ దిశా నిర్దేశం చేయటానికి ఈ శిక్షణా మాన్యువల్, ఉత్తమ ప్రకృతి సేద్య పద్ధతులకు అక్షర రూపం ఇచ్చినట్లు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ పేర్కొన్నారు. డాక్టర్ నీలం పటేల్ ఇలా అన్నారు: 'దేశవ్యాప్తంగా రైతులు అనుసరిస్తున్న ప్రకృతి సేద్య పద్ధతులు, ఆవిష్కరణలు, సంప్రదాయ విజ్ఞానంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రకృతి సేద్య అనుభవాల ఆధారంగా ఈ శిక్షణా మాన్యువల్‌ను రూపొందించాం. దేశంలో సుస్థిర వ్యవసాయాన్ని విస్తరింపజేయటంలో ఇదొక కీలక ముందడుగు'. ప్రకృతి వ్యవసాయ వారసత్వాన్ని సుసంపన్నం చేసిన సుభాష్ పాలేకర్ (మహారాష్ట్ర), ఎల్. నారాయణరెడ్డి (కర్ణాటక), శ్రీపాద దబోల్కర్, జి. నమ్మాళ్వార్ (తమిళనాడు), దీపక్ సచ్‌దే (మధ్యప్రదేశ్), భాస్కర్ సావే (గుజరాత్)ల సేవలను ఇందులో ప్రస్తుతించారు. దేశవ్యాప్తంగా ప్రకృతి సేద్య పథకాలు అమలవుతున్నాయని, 9.4 లక్షల హెక్టార్లలో సుమారు 10 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఇందులో పేర్కొన్నారు.

### అధిక దిగుబడి.. అధిక నికరాదాయం!

వరిని వరుసగా 4 ఏళ్లు ప్రకృతి వ్యవసాయం (ప్ర.వ్య.)లో పండిస్తే 2023 ఖరీఫ్‌లో ఎకరానికి 33.75 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. రసాయన వ్యవసాయం (ర.వ్య.)లో 31.5 క్వింటాళ్లు వచ్చింది. ఈ రెండు ధాన్యాలను క్వింటా రూ.2,040కే విక్రయించారు. ప్ర.వ్య.లో నికరాదాయం రూ.48 వేలు రాగా, రూపాయి ఖర్చుకు 2.3 రూపాయల ఆదాయం ముచ్చింది. ర.వ్య.లో నికరాదాయం రూ.35,140 రాగా, రూపాయి ఖర్చుకు 1.2 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చింది. ప్రధాన పంటలన్నింటిలో సాగు ఖర్చును కనీసం 5--10% తగ్గిస్తుంది. మరికొన్ని పంటల్లో, కొన్ని రాష్ట్రాల్లో 20--55% వరకు తగ్గింది. ✓ప్రకృతి వ్యవసాయం రైతులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేలల్లో సేంద్రియ కర్బనం 1947లో 2.5% ఉండేది. ఇప్పటికి 0.4%కి తగ్గింది. ప్రకృతి వ్యవసాయం దీన్ని 45% వరకు పెంచుతుంది. ✓నీరు, విద్యుత్‌లో 50--60% ఆదా అవుతుంది. ✓కర్బన ఉద్గారాలను 55--85% తగ్గిస్తుంది. ✓పశువులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెంచటం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. పంటల వైవిధ్యం, అంతరపంటలు, బహుళ అంచెల పంటలతో వ్యవసాయా దాయ భద్రత, పోషకాహార భద్రత పెరుగు తాయి. రసాయనిక సేద్యం ఏకపంట సాగుతో పోలిస్తే 20--40% అధిక నికర ఆదాయం వస్తుంది.

### జీవామృతం.. 48 గంటలు పులిస్తే చాలు!

జీవామృతం కోసం పేడ, మూత్రం, పప్పుల పిండి, బెల్లం, మట్టిని డ్రమ్ము నీటిలో కలిపిన తర్వాత 2--3 రోజులు పులియబెట్టి పంటలకు వాడుకోడానికి సిద్ధమైనట్లే. కలిపిన 48 గంటల్లో బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో వృద్ధి చెందుతుంది. సిద్ధమైన జీవామృతాన్ని వేసవిలో 7 రోజుల వరకు, శీతాకాలంలో 8--10 రోజుల్లో వాడుకోవచ్చని నీతి ఆయోగ్ ప్రకృతి వ్యవసాయ శిక్షణ మాన్యువల్ చెబుతోంది.

### ప్రకృతి సేద్యానికి మార్గదర్శకం

రసాయనిక వ్యవసాయానికి ఒక సుస్థిరమైన ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయం. ఇటు సంప్రదాయ విజ్ఞానాన్ని అటు ఆధునిక పర్యావరణ విజ్ఞానాన్ని ఇముడ్చుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రూపొందాయి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దీటైన సమాధానాలు ఇవ్వగలవు. తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతోనే వ్యవసాయానికి సుస్థిరత చేకూర్చటం సాధ్యమని ఈ పద్ధతులు చాటి చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా రైతులకు, విస్తరణ సిబ్బందికి ప్రకృతి సేద్య పద్ధతులపై శిక్షణ ఇవ్వటానికి ఈ మాన్యువల్ మార్గదర్శకంగా నిలుస్తుంది.

# ఇబ్రహీంపూర్ రోడ్డు పనులను పరిశీలించిన



వికారాబాద్ జిల్లా ( పరిగి న్యూస్): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రాములుపరిగి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్ రాములు మాట్లాడుతూ.. రోడ్డు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని గ్రామ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని ప్రతి గ్రామానికి రహదారుల నిర్మించేందుకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నిరంతరంగా కృషి చేస్తున్నరని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
అనంతపురం జిల్లా - శ్రీ సత్యసాయి జిల్లా
ఆదివారం - 18 - అక్టోబర్ - 2026

# అక్టోబర్ 19న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ రద్దు

### స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ నేపథ్యంలో ప్రభుత్వ సెలవు
### అర్జీల కోసం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచన
### క్షేత్రస్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిర్వహణ ఉండదు



అనంతపురం, అక్టోబర్ 17: (మహి న్యూస్): ఈ నెల 19వ తేదీ సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించబడదని స్పష్టం చేశారు.

# దుర్గి మండల ఆర్యవైశ్య అధ్యక్షుడిగా కపలవాయి శ్రీనివాసరావు (టెంపర్) ప్రమాణ స్వీకారం



దుర్గి, అక్టోబర్ 17:(మహి న్యూస్): దుర్గి మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా కపిలవాయి శ్రీనివాసరావు (టెంపర్) ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం దుర్గి మండల ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చందోలు ప్రకాష్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సభకు భవిరి శెట్టి రామారావు పరిచయకర్తగా వ్యవహరించారు. గౌరవ అతిథులుగా కపలవాయి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపవరపు వీరేశ్వర రావు, మండల గౌరవ అధ్యక్షుడు కపిలవాయి ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షుడు కపలవాయి శ్రీనివాసరావు (టెంపర్)తో పాటు 20 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం చేత జిల్లా అధ్యక్షుడు చందోలు ప్రకాష్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, మండలంలో ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి, సంఘటితత్వానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను పలువురు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# దుర్గమ్మ వారికి సారె సమర్పించిన టీటీడీ



విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 17 : తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి దుర్గమ్మ వారికి సారెను శనివారం మధ్యాహ్నం సమర్పించారు. ఆలయ అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలు జాస్తి సాంబశివరావు,నన్నపనేని సదాశివరావు,ఆలయ సూపరిమెంట్ సూర్యనారాయణ టిటిడి సిబ్బంది సారెను అమ్మవారికి సమర్పించిన వారిలో ఉన్నారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ ) అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను వారికి అందజేశారు.

# సుంకరపాలెం బైపాస్ డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం!

### మూడేళ్లుగా ఇబ్బందులు.. పైప్‌లైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభం



తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 17: మండల పరిధిలోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో గత మూడేళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కార మార్గం లభించింది. డ్రైనేజీ సమస్యతో స్థానిక వ్యాపారులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక కూటమి నాయకులు ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డ్రైనేజీ పక్కన పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు పనులు ప్రారంభించారు. పైప్‌లైన్ నిర్మాణం కోసం భారీ సిమెంట్ తూములను అక్కడికి తీసుకొచ్చి పనులు చేపడుతున్నారు. దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్న తమ సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభం కావడంతో స్థానిక వ్యాపారులు, వర్తకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే డ్రైనేజీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మీసాల వెంకన్న స్వామి ఆలయంలో అన్న సమారాధన



యానం, మహి న్యూస్, అక్టోబర్ 17: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో కొలువై ఉన్న రెడ్డి రాజుల కాలం నాటి పురాతన ఆలయమైన శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ శనివారం సుమారు 1,500 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ వారం యానంలోని ప్రముఖ వ్యాపార సంస్థ వసుంధర బట్టల దుకాణం యజమాని, వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో పాటు యానం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ ఆచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శనివారం ఆలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన కార్యక్రమం ద్వారా పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని భక్తులు పేర్కొన్నారు.

# 11వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా. బడుగు సందీప్ కుమార్




ముమ్మిడివరం, మహి న్యూస్, అక్టోబర్17: ముమ్మిడివరం నగరపంచాయతీ లో దాదాపు కౌన్సిలర్ అభ్యర్థులు పేరులు కూటమి పార్టీ నుండి దాదాపు కరారయ్యాయి 23వార్డులుకు గాను 11వార్డు టీడీపీ పార్టీ నుండి కౌన్సిలర్ అభ్యర్థి బడుగు సందీప్ కుమార్ పేరును శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఖరారు చేసారు, రెండవరోజు నామినేషన్ ముగియటంతో మూడవరోజు నామినేషన్ వేస్తారని తెలియజేసారు, ఆలాగే సందీప్ కుమార్ పై, నమ్మకంతో కౌన్సిల్ అభ్యర్థి గా, పోటీచేయు అవకాశం కల్పించినటువంటి, శాసనసభ్యులు సుబ్బరాజు, పృథ్వీ రాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ మరియు,జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, కూటమి నాయకులు కార్యకర్తలకు ఆలాగే వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అందరికి ఋణపడి ఉంటానని

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### ఎన్నికల ప్రకటన నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల నియమావళి అమలు
### ఓటర్లకు ప్రలోభాలు, బెదిరింపులు, మద్యం పంపిణీకి తావులేదు
### ఎన్నికల నిబంధనలపై విస్తృత ప్రచారం కల్పించాలి
### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్



అనంతపురం, అక్టోబర్ 17: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన చేయాల్సినవి, చేయకూడనివి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం రూపొందించిన నిబంధనలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని సూచించారు.

## చేయాల్సినవి

1ల. ఎన్నికల ప్రకటనకు ముందే క్షేత్రస్థాయిలో ప్రారంభమైన అభివృద్ధి కార్యక్రమాలను నిబంధనలకు అనుగుణంగా కొనసాగించవచ్చు.

2ల. వరదలు, కరువు, తెగుళ్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపట్టవచ్చు.

3ల. ప్రాణాపాయ స్థితిలో లేదా తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నవారికి తగిన అనుమతులతో నగదు లేదా వైద్య సదుపాయాలు అందించవచ్చు.

4ల. ఎన్నికల సమావేశాలకు మైదానాలు, హెలిప్యాడ్లు అన్ని పార్టీలకు, అభ్యర్థులకు నిష్పక్షపాతంగా అందుబాటులో ఉండాలి.

5ల. ఇతర పార్టీలు, అభ్యర్థులపై విమర్శలు వారి విధానాలు, కార్యక్రమాలు, గత రికార్డు, పనితీరుకు పరిమితం కావాలి.

6ల. సమావేశాలు, ఊరేగింపుల కోసం పోలీసులకు ముందస్తు సమాచారం అందించి అవసరమైన అనుమతులు పొందాలి. లౌడ్‌స్పీకర్ల వినియోగానికి కూడా అనుమతి తీసుకోవాలి.

7ల. ఊరేగింపుల మార్గం, ప్రారంభం, ముగింపు సమయాలను ముందుగానే నిర్ణయించి పోలీసుల అనుమతి పొందాలి. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూడాలి.

8ల. శాంతియుత పోలింగ్ నిర్వహణకు ఎన్నికల అధికారులకు సహకరించాలి. ఎన్నికల సిబ్బంది తమ గుర్తింపు కార్డులు లేదా బ్యాడ్జీలు ప్రదర్శించాలి.

9ల. ఓటర్లకు ఇచ్చే అనధికారిక గుర్తింపు పత్రాలపై పార్టీ పేరు, అభ్యర్థి పేరు, చిహ్నం ఉండకూడదు.

10ల. ప్రచార కాలం, పోలింగ్ రోజున వాహనాల రాకపోకలపై విధించిన ఆంక్షలను పాటించాలి.

11ల. పోలింగ్ కేంద్రాల్లోకి రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అనుమతి ఉన్నవారు మాత్రమే ప్రవేశించాలి.

12ల. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ లేదా సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

13ల. ప్రచార సమయం ముగిసిన తర్వాత సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఓటరు, అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్ కానివారు ఆ నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలి.

## చేయకూడనివి

1ల. ప్రభుత్వ ప్రజాధనంతో అధికార పార్టీ సాధించిన విజయాలను ప్రచారం చేసే ప్రకటనలు ఇవ్వకూడదు.

2ల. అధికారిక విధులను ఎన్నికల ప్రచారంతో కలపకూడదు. మంత్రులు, ఇతర నాయకులు పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రవేశించేందుకు వర్తించే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

3ల. ఓటర్లకు డబ్బు, ఇతర ప్రలోభాలు చూపడం, బెదిరించడం, ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడకూడదు.

4ల. కులం, మతం ఆధారంగా ఓట్లు అడగడం, వర్గాల మధ్య విద్వేషాలు లేదా ఉద్రిక్తతలు సృష్టించడం నిషేధం.

5ల. ధృవీకరించని ఆరోపణలు, వక్రీకరించిన సమాచారంతో ఇతర పార్టీలు, అభ్యర్థులపై విమర్శలు చేయకూడదు. ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదు.

6ల. లంచం, అనుచిత ప్రభావం, నకిలీ ఓటింగ్, ఓటర్లను బెదిరించడం, పోలింగ్ కేంద్రాల సమీపంలో ప్రచారం, నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి చర్యలకు పాల్పడకూడదు.

7ల. ఇతరుల ఇళ్లు, భూములు, భవనాలు, ప్రహరీ గోడలు, వాహనాలపై సంబంధిత అనుమతి లేకుండా జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయడం లేదా నినాదాలు రాయడం చేయకూడదు.

8ల. ఇతర పార్టీలు నిర్వహించే సమావేశాలు, ఊరేగింపులకు ఆటంకం కలిగించకూడదు. ఊరేగింపుల్లో ఆయుధాలుగా ఉపయోగించగల వస్తువులను తీసుకెళ్లరాదు.

9ల. పోలింగ్ రోజున ఓటర్ల గుర్తింపు పత్రాల పంపిణీ కేంద్రాలు, పోలింగ్ బూత్‌ల సమీపంలో ప్రచార సామగ్రిని ప్రదర్శించరాదు.

10ల. సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు ఉపయోగించరాదు. ఉదయం 6 గంటల ముందు, రాత్రి 10 గంటల తర్వాత వాటి వినియోగంపై విధించిన ఆంక్షలను పాటించాలి.

11ల. ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేయకూడదు.

12ల. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్, వెబ్ మీడియా ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రచురించే ముందు వర్తించే నిబంధనల ప్రకారం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ముందస్తు ధ్రువీకరణ పొందాలి.

13ల. అధికారిక భద్రత కల్పించిన వ్యక్తులు పోలింగ్ రోజున భద్రతా సిబ్బందితో పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలోకి ప్రవేశించడం, నియోజకవర్గంలో తిరగడంపై విధించిన ఆంక్షలను పాటించాలి. ఓటరుగా ఉన్నప్పుడు ఓటు వేయడానికి సంబంధించిన మినహాయింపులు వర్తిస్తాయి.

14ల. అధికారిక లేదా ప్రైవేటు భద్రత కలిగిన వ్యక్తులను ఎన్నికల ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు లేదా కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించడంపై ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటించాలి. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఉల్లంఘనలకు తావులేకుండా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఓ. ఆనంద్ స్పష్టం చేశారు.

# అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో రెండో రోజు 192 నామినేషన్లు

### మేయర్ పదవికి 5 నామినేషన్లు టీడీపీ నుంచి 101, వైఎస్సార్‌సీపీ నుంచి 72 నామినేషన్లు

అనంతపురం, అక్టోబర్ 17: (మహి న్యూస్): అనంతపురం నగరపాలక సంస్థ రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026లో



భాగంగా రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో మొత్తం 192 నామినేషన్లు స్వీకరించారు. మేయర్ పదవికి రెండో రోజు 5 నామినేషన్లు అందాయి. వీటిలో స్వతంత్ర అభ్యర్థుల నుంచి 3, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి 1, ఇతర పార్టీల నుంచి 1 నామినేషన్ స్వీకరించారు.

### 62 డివిజన్లకు రెండో రోజు వచ్చిన నామినేషన్ల



వివరాలు ఇలా ఉన్నాయి.

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) - 101
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) - 72
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) - 2
జనసేన పార్టీ -- 3
సీపీఐ - 2
బీఎస్పీ - 1
స్వతంత్ర అభ్యర్థులు - 11
ఇప్పటివరకు 208 నామినేషన్లు

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి మేయర్ పదవికి మొత్తం 5 నామినేషన్లు స్వీకరించారు. వీటిలో స్వతంత్ర అభ్యర్థుల



నుంచి 3, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి 1, ఇతర పార్టీల నుంచి 1 నామినేషన్ ఉన్నాయి. అదేవిధంగా, 62 డివిజన్లకు ఇప్పటివరకు మొత్తం 208 నామినేషన్లు అందాయి. పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) - 113
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) - 76
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) - 2
జనసేన పార్టీ - 3
సీపీఐ - 2
బీఎస్పీ - 1
స్వతంత్ర అభ్యర్థులు - 11

ఇప్పటివరకు నమోదైన నామినేషన్ల వివరాలను డివిజన్, పార్టీ వారీగా పత్రికా ప్రకటనకు జత చేసినట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

# 7వ రోజు దసరా సేవల్లో 750 మంది జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 100 మంది యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు

విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 17 : ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో ఏడవ రోజు కూడా ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఉత్సాహంగా సేవలందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా, ఐఏఎస్ ఆదేశాల మేరకు 750 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 100 మంది యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు భక్తులకు వివిధ రూపాల్లో సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లు భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమంలో సహకరిస్తున్నారు. అదేవిధంగా వైద్య సేవలకు సహకరించడం, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించడం, భక్తుల రద్దీని నియంత్రించడం వంటి సేవల్లో చురుకుగా పాల్గొంటున్నారు. రాత్రింబవళ్లు నిరంతరాయంగా సేవలందిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తమ వంతు




కృషి చేస్తున్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ వ్యక్తిగత సెలవులను పక్కనపెట్టి, భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో యువతీ యువకులు గత ఏడు రోజులుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమ శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా భక్తులకు సహాయం అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. వాలంటీర్ల సేవలపై భక్తుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవ చేయడం ఎంతో ఆనందాన్ని, ఆత్మతృప్తిని కలిగిస్తోందని తెలిపారు. ప్రజాసేవలో పాల్గొనే అవకాశాన్ని కల్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశాకు, వాలంటీర్ల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ మార్గనిర్దేశం చేస్తున్న జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మరియు జిల్లా టూరిజం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా యువత చేస్తున్న సేవలు సామాజిక బాధ్యతకు, సేవాభావానికి, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

# వైభవోపేతంగా ఆదిదంపతులనగరోత్సవం



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 17 :దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సప్తమ ఘట్టానికి చేరుకున్న వేళ, ఇంద్రకీలాద్రి పురవీధులు సాక్షాత్తు కైలాస-వైకుంఠాలను తలపించాయి. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఆదిదంపతుల నగర రథయాత్ర అశేష భక్తజన హర్షాతిరేకాల మధ్య కన్నులపండువగా సాగింది. ?ఒకవైపు కొండపై అమ్మవారు సర్వ సంపదల నిలయమైన శ్రీ మహాలక్ష్మి దేవిగా సర్వాభరణ భూషితురాలై దర్శనమిస్తుండగా, సూర్యాస్తమయ ప్రదోషవేళ కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో అర్చకులు ఉత్సవ విగ్రహాలకు పూర్ణాహుతి తరహా వైభవంతో విశేష నివేదనలు, పంచహారతులు సమర్పించారు. మంగళవాద్యాల ఘోషతో పల్లకీ కదలగానే వేలాది భక్తజనం ఒక్కసారిగా చేతులెత్తి నమస్కరిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. కేవలం సంప్రదాయ మేళాలకే పరిమితం కాకుండా, శనివారం రథయాత్ర వెంట సాగిన శాక్సోఫోన్ స్వరాలాపనలు, కేరళ పంచవాద్యాల లయబద్ధమైన దరువులు, మరియు



కూచిపూడి కళాకారుల ముద్రాయుక్త నాట్య విన్యాసాలు భక్తులను ఎంతగానో సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. మహిళల కోలాట బృందాల అడుగుల సవ్వడి రథం ముంగిట ప్రత్యేక శోభను సంతరించుకుంది. శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం నుండి ప్రారంభమైన ఈ దివ్యయాత్ర రథం సెంటర్, వినాయకుడి గుడి, కెనాల్ రోడ్డు మీదుగా సాగి కృష్ణానది తీరమైన దుర్గా ఘాట్ వద్దకు చేరింది. అక్కడ నదీమతల్లి సాక్షిగా ఆదిదంపతులకు భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు. అనంతరం ఘాట్ రోడ్డు మార్గంలో భక్తుల జయజయధ్వానాల నడుమ రథం కొండపైకి చేరుకుంది. నగరోత్సవం పరిసమాప్తమైన అనంతరం, మహారాజగోపురం ముందు ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి ఆలయ స్థానాచార్యుల పర్యవేక్షణలో వేదోక్తంగా దివ్య “ఆస్థాన సేవ” నిర్వహించారు. వేద పండితులు స్వస్తివాచకాలు పలుకగా, అర్చక బృందం విశేష చతుర్వేద హారతులు సమర్పించారు. శాస్త్ర వచనాల ప్రకారం జగన్మాత లక్ష్మీ స్వరూపంలో ఉన్నప్పుడు, పరమేశ్వరునితో కలిసి పురవీధుల్లో విహరించే ఆదిదంపతులను రథంపై దర్శించుకుంటే ఆ ఇంట సిరిసంపదలకు కొరత ఉండదని, సమస్త రుణబాధలు తొలగి సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. ఈ విశేష నగర రథోత్సవంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు,దేవస్థానం సిబ్బంది,అసంఖ్యాక భక్తజనం పాల్గొని పరవశించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## జయరాజ్ ఫార్చ్యూన్ ప్యాకేజింగ్స్
# పరిశ్రమను తనిఖీ చేసిన ఏపీపీసీబీ ఛైర్మన్

### పరిశ్రమలో కాలుష్య నియంత్రణ వ్యవస్థల పనితీరుపై సమీక్ష
### పర్యావరణ ప్రమాణాల అమలుపై అధికారుల పరిశీలన




గుంటూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఛైర్మన్ పి. కృష్ణయ్య, ఐఏఎస్ (రిటైర్డ్), గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం తక్కెళ్లపాడు గ్రామంలోని జయరాజ్ ఫార్చ్యూన్ ప్యాకేజింగ్స్ పరిశ్రమను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రాంగణాన్ని పరిశీలించిన ఛైర్మన్, ముడి పదార్థాల వినియోగం, కారుగేటెడ్ బాక్సుల తయారీ ప్రక్రియకు సంబంధించిన కార్యకలాపాలను సమీక్షించారు. అనంతరం పరిశ్రమలో ఏర్పాటు చేసిన వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్ (ఈటీపీ), బాయిలర్ నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ వ్యవస్థలు, ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను పరిశీలించారు.



పరిశ్రమలో అమలవుతున్న తయారీ ప్రక్రియలు, కాలుష్య నియంత్రణ పరికరాల పనితీరు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఏపీపీసీబీ గుంటూరు ప్రాంతీయ పర్యావరణ ఇంజినీర్ ఎం.డి. నజీనా బేగం ఛైర్మన్‌కు వివరించారు. పరిశ్రమ కార్యకలాపాలు అమల్లో ఉన్న పర్యావరణ ప్రమాణాలు, కాలుష్య నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలను ఛైర్మన్ క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ తనిఖీలో గుంటూరు ప్రాంతీయ కార్యాలయ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొర్నిపాడు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

### ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు
### పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు
### ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదులకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



గుంటూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): వట్టిచెరుకూరు మండలం కొర్నిపాడు పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం తనిఖీ చేశారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సున్నిత, అతి సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే ముందుగానే జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ తదితర సదుపాయాలు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు.



వార్డుల వారీగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు పక్కాగా ఉండాలని, ఎన్నికల విధులకు వచ్చే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు గుర్తించినా, ఎన్నికలకు సంబంధించి సందేహాలు లేదా ఫిర్యాదులు ఉన్నా 08632 234014 హెల్ప్‌డెస్క్/కాల్ సెంటర్ నంబర్‌ను సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి జిల్లాను ఆదర్శంగా నిలపాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, మండల అధికారులు పాల్గొన్నారు.

# మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ బరిలో టీడీపీ అభ్యర్థి యొనుముల సుష్మ కేశవరెడ్డి



మాచర్ల, అక్టోబర్ 17 (మహి న్యూస్): మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ తరపున యొనుముల సుష్మ కేశవరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆమె, ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. మాచర్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఛైర్మన్ పదవికి టీడీపీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తదుపరి ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా ఎన్నికల అధికారులు ప్రక్రియను నిర్వహించనున్నారు.

## మాచర్ల 36వ వార్డు వైసీపీ అభ్యర్థిగా రామ తులసి ఆనంద్



మాచర్ల అక్టోబర్ 17: (మహి న్యూస్ ): పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 36వ వార్డు అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోలేపల్లి ఆనంద్ భార్య రామ తులసికి పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఈ క్రమంలో ఆమె నామినేషన్ దాఖలు చేశారు. రామ తులసి అభ్యర్థిత్వానికి వైసీపీ నాయకులు గెల్లెపోగు సామేలు, ఆకులపల్లి రమేష్ మద్దతు తెలుపుతూ నామినేషన్‌ను బలపరిచారు. 36వ వార్డు నుంచి ఆమె పోటీకి సిద్ధం కావడంతో స్థానిక రాజకీయ వర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

# అక్రమ బెల్ట్ షాపుపై దుర్గి పోలీసుల దాడి

### ఒకరి అరెస్ట్.. 8 క్వార్టర్ల మద్యం స్వాధీనం



దుర్గి అక్టోబర్ 16:(మహి న్యూస్): దుర్గి గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గొంది వెంకయ్యను దుర్గి పోలీసులు అరెస్టు చేశారు. దుర్గి ఎస్ఐ బి. గోపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల్లో నిందితుడి వద్ద నుంచి 8 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి. గోపాల్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని, అక్రమ మద్యం విక్రయాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రెండో విడత శిక్షణ

### పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు సమర్థవంతమైన శిక్షణ అందించాలి
### ఎన్నికల నిబంధనలు, తాజా మార్గదర్శకాలపై పూర్తి అవగాహన ఉండాలి
### ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వకూడదు: కలెక్టర్ కృతిక శుక్ల




పల్నాడు, అక్టోబర్ 17: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ అధికారులు (పీఓలు), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓలు) సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా శిక్షణ అందించాలని కలెక్టర్ కృతిక శుక్ల సూచించారు. శనివారం టౌన్ హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల చట్టాలు, నిబంధనలు, అధికారిక మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమని, ప్రతి ఓటరు స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ చట్టాలు, నియమావళి, అధికారిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, మాస్టర్ ట్రైనర్లు శిక్షణ సామగ్రిని పూర్తిగా అధ్యయనం చేసి, సందేహాలను నివృత్తి చేసుకున్న తర్వాతే క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ అందించాలని సూచించారు. గతంలో ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రతి ఎన్నికలో నిబంధనలు, విధానాల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున తాజా మార్గదర్శకాలను తెలుసుకోవాలని చెప్పారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారుల విధులను, ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన ప్రతి దశను మాస్టర్ ట్రైనర్లు స్పష్టంగా వివరించాలని సూచించారు. శిక్షణ సమయంలో సిబ్బంది అడిగే సందేహాలకు అధికారిక శిక్షణ సామగ్రి ఆధారంగా సమాధానాలు ఇవ్వాలని, ఊహాజనిత సమాచారంతో వివరణలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల విధులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో,



అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# బతుకమ్మ పూలలో ఔషధ గుణాలు.. ఆరోగ్య రహస్యాలు!

### తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ..
### ప్రకృతి పరిరక్షణలోనూ ప్రత్యేకత
### బతుకమ్మ పండుగ విశిష్టత, పూల ఔషధ గుణాలను వివరించిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్

రాజుపాలెం అక్టోబర్ 17:(మహి న్యూస్): బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రకృతిని ఆరాధిస్తూ ఆరోగ్య పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెప్పే విశిష్టమైన పండుగగా గుర్తింపు పొందిందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టత, అందులో ఉపయోగించే పూల ఔషధ గుణాల గురించి ఆయన వివరించారు.

#### ప్రకృతిని ఆరాధించే పూల పండుగ

బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర పండుగ అని, తొమ్మిది రోజులపాటు మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలను గోపురాకారంలో పేర్చి, పైన గౌరమ్మను ఉంచి పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బతుకమ్మ చుట్టూ చేరి జానపద పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంబరాలు చేసుకోవడం తెలంగాణ సంప్రదాయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు.

#### బతుకమ్మ పూలలో ఔషధ గుణాలు

బతుకమ్మలో ఉపయోగించే పూలకు సంప్రదాయ వైద్యంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని డాక్టర్ ఆర్. శ్రీనివాస్ వివరించారు. తంగేడు పూలు, ఆకులు, బెరడును సంప్రదాయ వైద్యంలో ఉపయోగిస్తారని తెలిపారు. గుమ్మడి పూలలో విటమిన్లు ఉంటాయని, తామర పువ్వుకు సంప్రదాయ వైద్యంలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. నందివర్ధనం, గునుగు వంటి పూలకు కూడా వివిధ



సంప్రదాయ ఉపయోగాలు ఉన్నాయని వివరించారు.

#### పర్యావరణ పరిరక్షణకు సందేశం

వర్షాకాలం ముగిసే సమయంలో జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పూలతో బతుకమ్మలను తయారు చేసి చెరువుల్లో నిమజ్జనం చేయడం ఈ పండుగలో భాగమని, అయితే పూలతోనే నీరు పూర్తిగా శుద్ధి అవుతుందని భావించకూడదని పేర్కొన్నారు. చెరువులు, కుంటలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి వనరుల్లో వ్యర్థాలు వేయకుండా చూడటం అందరి బాధ్యత అని సూచించారు.

#### మహిళల ఐక్యతకు ప్రతీక

బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. తొమ్మిది రోజులపాటు రోజుకో ప్రత్యేక పేరుతో బతుకమ్మను పూజించి, నైవేద్యాలు సమర్పిస్తారని, చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహిస్తారని వివరించారు. పూజల అనంతరం



ప్రసాదాలను పరస్పరం పంచుకోవడం ఈ పండుగలోని ప్రత్యేక సంప్రదాయమన్నారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవం, మహిళల ఐక్యత, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని డాక్టర్ ఆర్. శ్రీనివాస్ పేర్కొన్నారు. సంప్రదాయాలను కొనసాగిస్తూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

## కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆయుర్వేద ఆరోగ్య శిబిరం

### సీజనల్ వ్యాధులపై అవగాహన.. ఉచితంగా ఆయుర్వేద మందుల పంపిణీ




కారంపూడి అక్టోబర్ 17:(మహి న్యూస్ ): పల్నాడు జిల్లా కారంపూడి మండలంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద ఆరోగ్య శిబిరం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని




తెలిపారు. ముఖ్యంగా పెద్దలు, మహిళలు, పిల్లలు వాతావరణ మార్పుల కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలు, నీరసం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ తగినంత నీరు తాగడంతో పాటు కొబ్బరినీరు, మజ్జిగ, పండ్ల రసాలు, నిమ్మరసం, సబ్జా నీరు, రాగిజావ వంటి పానీయాలను తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీటి లోపం ఏర్పడకుండా తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని వివరించారు. అవసరమైన సందర్భాల్లో నీటిలో నిమ్మరసం, కొద్దిగా ఉప్పు, చక్కెర కలిపి తీసుకోవచ్చని తెలిపారు. ఆయుర్వేదంలో పేర్కొన్న దినచర్య, ఋతుచర్య ప్రాముఖ్యతను వివరిస్తూ ఆరోగ్య పరిరక్షణకు తగిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం శిబిరానికి హాజరైన వారికి ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా ఆయుష్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ హనుమంతరావు, ప్రధాన పూజారి సాయి మణికంఠ శాస్త్రి, హెల్త్ సూపర్వైజర్ మస్తాన్ వలి నాయక్, మలేరియా అసిస్టెంట్ కళ్యాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అచ్చమ్మ, రత్నకుమారి, గ్రామ పెద్దలు కోటేశ్వరరావు, రామ్మోహనరావు, వెంకటేశ్వరరావు, శేషారావు, ఆయుష్ సిబ్బంది ఎస్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాయవరం తుమ్మేపల్లి ఎస్సీ కాలనీలో రోడ్లకు మహర్దశ

### పల్లె పల్లెకు వెలుగు కార్యక్రమంలో సీసీ రోడ్లకు మంజూరు



మాచర్ల అక్టోబర్ 17: (మహి న్యూస్) : రాయవరం గ్రామ పరిధిలోని తుమ్మేపల్లి ఎస్సీ కాలనీలో వీధి రోడ్లకు మహర్దశ పట్టింది. పల్లె పల్లెకు వెలుగు కార్యక్రమంలో భాగంగా కాలనీలోని వీధులకు సీసీ రోడ్లు మంజూరు కావడంతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్ల పూర్తయితే కాలనీవాసులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో బురద, గుంతలతో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, విద్యార్థులకు సైతం సౌకర్యంగా ఉండనుంది. వీధి రోడ్ల అభివృద్ధిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి సైదులు, భీమ కృష్ణమూర్తి, హనుమంతరావు, సుబ్బారావు, మట్ట చిలక రామయ్య, మట్ట ఎల్లమంద, గమ్మిడి నారాయణ, మట్ట శ్రీను, జుజురి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## తుమ్మేపల్లిలో బతుకమ్మ సంబరాల సందడి..
# పూల పండుగతో పల్లెకు కొత్త శోభ



మాచర్ల (రాయవరం) అక్టోబర్ 17:(మహి న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పూల పరిమళాలతో, మహిళల ఆటపాటలతో, ఆనందోత్సాహాలతో మనసులను మురిపిస్తుంది. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలనే దేవతగా కొలుస్తూ జరుపుకునే ఈ పండుగ స్త్రీమూర్తుల ఐక్యతకు, కుటుంబాల సంతోషానికి, పల్లె సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తుంది. రాయవరం గ్రామ పరిధిలోని తుమ్మేపల్లిలో పండుగ వాతావరణం ఆహ్లాదాన్ని పంచుతోంది. పూల అందాలు, భక్తిభావం, సంప్రదాయాల సోయగంతో గ్రామం పండుగ శోభను సంతరించుకుంటోంది. బతుకమ్మ పాటలు ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, పూల పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని విరబూయించాలని ఆకాంక్షిద్దాం.

#### తుమ్మేపల్లి ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు!

ఆ పూలమ్మల ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి. రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కాలి. గ్రామంలో ఐకమత్యం, సోదరభావం పెంపొందాలి. ప్రతి అడుగులో విజయం తోడై, తుమ్మేపల్లి గ్రామం సిరిసంపదలతో, శాంతిసౌభాగ్యాలతో కళకళలాడాలి. బతుకమ్మ పూల పరిమళంలా తుమ్మేపల్లి ప్రజల జీవితాలు సంతోషాలతో నిండిపోవాలి.. అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలి!

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# అక్టోబర్ 19న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ నేపథ్యంలో ప్రభుత్వ సెలవు**

**కలెక్టరేట్‌కు అర్జీల కోసం రావద్దని జిల్లా కలెక్టర్ సూచన**

**క్షేత్రస్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిర్వహణ ఉండదు**




తిరుపతి, అక్టోబర్ 17: (మహి న్యూస్): ఈ నెల 19వ తేదీ సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఉండదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడదని స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆర్ఓలు, ఏఆర్ఓలకు శిక్షణ

**ఎన్నికల విధులు, బాధ్యతలపై సిబ్బందికి శిక్షణ తరగతులు**







చిత్తూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): చిత్తూరులోని స్థానిక జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు), ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు, సిబ్బందికి శిక్షణ అందించారు. డీడీ, ఐ అండ్ పీఆర్, చిత్తూరు.

# పురపాలక ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

**నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదు**

**అధికారులు బాధ్యతతో, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి**

**నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి**



చిత్తూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): పురపాలక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శనివారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని, అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి 15 వార్డు కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్తూరు మేయర్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు నగరపాలక సంస్థ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు సమర్పించాలని పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఆర్వో పుల్లారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ ఎన్నికల సెల్ విడుదల చేసిన ప్రకటన ఆధారంగా.





# చిత్తూరు మేయర్ పదవికి రెండో రోజు 8 సెట్ల నామినేషన్లు

**ఆరుగురు అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కటారి హేమలత, అశోక్ ఆనంద్ యాదవ్ చెరో రెండు సెట్లు**



చిత్తూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ పదవికి రెండో రోజు 8 సెట్ల నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పుల్లారెడ్డి తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ ఆర్వో కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

**నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలు:**

కాంగ్రెస్ పార్టీ - ఆర్. పూర్ణ చంద్రశేఖర్

తెలుగుదేశం పార్టీ - కటారి హేమలత

తెలుగుదేశం పార్టీ డమ్మీ అభ్యర్థి - అశోక్ ఆనంద్ యాదవ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ - ఆర్. చంద్రశేఖర్

స్వతంత్ర అభ్యర్థి - ఆర్. శశి కుమార్ నాయకర్





స్వతంత్ర అభ్యర్థి - టీజీ నాని

వీరిలో కటారి హేమలత రెండు సెట్ల నామినేషన్లు, అశోక్ ఆనంద్ యాదవ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన నలుగురు అభ్యర్థులు ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో మొత్తం 8 సెట్ల నామినేషన్లు నమోదయ్యాయి. చిత్తూరు నగరపాలక సంస్థ ఎన్నికల సెల్ ఈ వివరాలను వెల్లడించింది.

# నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం మున్సిపాలిటీల పరిధిలో ఆంక్షలు**

**నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు**

చిత్తూరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): చిత్తూరు జిల్లా పరిధిలోని చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు పలమనేరు, నగరి, కుప్పం మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 16వ తేదీ రాత్రి 11 గంటల నుంచి అమల్లోకి వచ్చిన ఆంక్షలు అక్టోబర్ 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు లేదా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు, వీటిలో ఏది ముందుగా జరిగితే అప్పటివరకు అమల్లో ఉంటాయని తెలిపారు.

**ఆంక్షలు ఇవీ..**

1ఎ. సమర్థ అధికారి ముందస్తు అనుమతి లేకుండా నాలుగు పట్టణ స్థానిక సంస్థల నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదు.

2ఎ. అనుమతి లేకుండా బహిరంగ సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించడం, సమావేశాలకు హాజరుకావడం నిషేధం.

3ఎ. విధుల్లో ఉన్న అధీకృత సిబ్బంది మినహా ఇతరులు బహిరంగ ప్రదేశాల్లో ఆయుధాలు, కర్రలు, రాడ్లు, తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా ఆయుధాలుగా ఉపయోగించగల వస్తువులను తీసుకెళ్లరాదు.

4ఎ. ప్రజాశాంతికి భంగం కలిగించే, మత ఉద్రిక్తతలు సృష్టించే, హింసను ప్రేరేపించే లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడరాదు. ఈ ఉత్తర్వులను కఠినంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చిత్తూరు పోలీసు సూపరింటెండెంట్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఇతర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# తిరుపతి నగరపాలక సంస్థలో మేయర్ స్థానానికి 11, కార్పొరేటర్ స్థానాలకు 184 నామినేషన్లు

**సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, పుత్తూరులోనూ కొనసాగిన నామినేషన్ల ప్రక్రియ**

**రెండో రోజు నామినేషన్ల వివరాలు వెల్లడించిన కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి, అక్టోబర్ 17: (మహి న్యూస్): తిరుపతి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు శనివారం సజావుగా కొనసాగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థతో పాటు సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో రెండో రోజు దాఖలైన నామినేషన్ల వివరాలను వెల్లడించారు.

### తిరుపతి నగరపాలక సంస్థ

తిరుపతి మేయర్ స్థానానికి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో టీడీపీ నుంచి ఒకటి, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 10 నామినేషన్లు ఉన్నాయి.

66 డివిజన్లలో కార్పొరేటర్ స్థానాలకు మొత్తం 184 నామినేషన్లు దాఖలయ్యాయి.

టీడీపీ - 86
వైఎస్సార్‌సీపీ - 18
జనసేన - 18
బీజేపీ - 8
సీపీఎం - 1
స్వతంత్ర అభ్యర్థులు - 47
ఇతరులు - 6

### సూళ్లూరుపేట మున్సిపాలిటీ

32 వార్డులున్న సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ స్థానానికి వైఎస్సార్‌సీపీ నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 47 నామినేషన్లు వచ్చాయి.

టీడీపీ - 16
వైఎస్సార్‌సీపీ - 19
బీజేపీ - 4
జనసేన - 2
స్వతంత్ర అభ్యర్థులు - 6

### నాయుడుపేట మున్సిపాలిటీ

నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ స్థానానికి టీడీపీ నుంచి ఒకటి, వైఎస్సార్‌సీపీ నుంచి ఒకటి చొప్పున మొత్తం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. 32 వార్డుల పరిధిలో వార్డు సభ్యుల స్థానాలకు 29 నామినేషన్లు వచ్చాయి.

టీడీపీ - 3
వైఎస్సార్‌సీపీ - 22
బీజేపీ - 1
జనసేన - 1
స్వతంత్ర అభ్యర్థులు - 2

### వెంకటగిరి మున్సిపాలిటీ

వెంకటగిరి మున్సిపల్ చైర్మన్ స్థానానికి వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీఎస్పీ నుంచి ఒక్కొక్కటి చొప్పున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. 36 వార్డుల పరిధిలో వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 64 నామినేషన్లు వచ్చాయి. వీటిలో టీడీపీ నుంచి 39, వైఎస్సార్‌సీపీ నుంచి 25 నామినేషన్లు దాఖలయ్యాయి.

### పుత్తూరు మున్సిపాలిటీ

పుత్తూరు మున్సిపల్ చైర్మన్ స్థానానికి వైఎస్సార్‌సీపీ నుంచి 3, టీడీపీ నుంచి 1, జనసేన నుంచి 1 చొప్పున మొత్తం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. 36 వార్డుల పరిధిలో వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 76 నామినేషన్లు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

టీడీపీ - 48
వైఎస్సార్‌సీపీ - 24
జనసేన - 2
స్వతంత్ర అభ్యర్థులు - 2

జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు.

# లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష

**పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**

**బెయిల్ మంజూరైన కేసుల స్థితిగతులపై ఆరా**



కర్నూలు, అక్టోబర్ 17: (మహి న్యూస్): కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి శనివారం కర్నూలు కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, న్యాయపరమైన సలహాలు, జైలు సందర్శనలు, కేసుల వివరాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఎన్ని కేసులకు బెయిల్ మంజూరైంది, ఆయా కేసుల ప్రస్తుత పరిస్థితి ఏమిటనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ చంద్రరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ. సులోచన, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

**ప్రకటనల ప్రసారానికి మూడు రోజుల ముందుగా ఎంసీఎంసీ బృందానికి దరఖాస్తు చేయాలి ౹ సోషల్ మీడియా, పెయిడ్ న్యూస్‌పైనా నిరంతర పర్యవేక్షణ**



గుంటూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ప్రసారం చేయడానికి ముందస్తు అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వివిధ టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ ఛానళ్లు, సినిమా హాళ్లు తదితర ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చేందుకు కనీసం మూడు రోజుల ముందుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ (ఎంసీఎంసీ) బృందానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ప్రకటనకు సంబంధించిన వీడియో, స్క్రిప్ట్, ప్రసార సమయం, తయారీ ఖర్చు, ప్రసారం చేసే మీడియా వివరాలు, ప్రసార వ్యయం తదితర సమాచారాన్ని సమర్పించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఉన్న ప్రకటనలకు మాత్రమే అనుమతులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రింట్ మీడియా, సోషల్ మీడియాలో ఇచ్చే ప్రకటనల ఖర్చులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాల్లో నమోదు చేస్తామని తెలిపారు. ఎంసీఎంసీ బృందం పెయిడ్ న్యూస్‌తో పాటు సోషల్ మీడియాలో ప్రచారమయ్యే అంశాలను కూడా పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌ల రూపంలో ఇచ్చే ప్రచార సందేశాలకు కూడా అవసరమైన అనుమతులు తప్పనిసరని తెలిపారు. పోలింగ్‌కు ముందు రోజు ప్రింట్ మీడియాలో ఇచ్చే ప్రకటనలకు సైతం ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రించే అభ్యర్థులు వాటి సంఖ్య, ముద్రణ ఖర్చుల వివరాలతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ముద్రించినట్లు ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు

**శిక్షణకు గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు**

**రోజువారీ నివేదికలు తప్పనిసరిగా పంపాలి: జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ**

గుంటూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించే అధికారులపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు పూర్తి బాధ్యతతో, అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. శనివారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

### శిక్షణకు గైర్హాజరైతే చర్యలు

ఎన్నికల విధులకు నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు) తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సరైన కారణం లేకుండా శిక్షణకు గైర్హాజరయ్యే ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, విధుల నిర్వహణ, అధికారుల మధ్య సమన్వయం వంటి అంశాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

### రోజువారీ నివేదికలు తప్పనిసరి

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రోజువారీ నివేదికలను అధికారులు క్రమం తప్పకుండా పంపించాలని ఆదేశించారు. నివేదికల సమర్పణలో జాప్యం చేయకుండా, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్ల బాలిక మృతిపై బాలల హక్కుల కమిషన్ విచారణ

**గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కమిషన్ సభ్యురాలు పద్మలత**

**బాలిక శరీరంపై గాయాలు, పంటి గాట్లు గుర్తింపు**

**పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు**



గుంటూరు, అక్టోబర్ 17: (మహి న్యూస్): గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో రెండేళ్ల బాలిక మృతి ఘటనపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ విచారణ చేపట్టింది. బాలల హక్కుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషన్ సభ్యురాలు కే.జి.వి. పద్మలత తెలిపారు. శనివారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను సందర్శించిన ఆమె బాలిక మృతికి సంబంధించిన వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల వివరాల ప్రకారం, స్థానిక సుభానీ కాలనీకి చెందిన సుభాష్ దంపతులు తమ రెండేళ్ల కుమార్తెను అక్టోబర్ 17న ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. బాలిక ఆడుకుంటూ మెట్లపై నుంచి పడిపోయిందని తల్లిదండ్రులు చెప్పినట్లు వైద్యులు వివరించారు. అయితే, బాలిక ముఖం, శరీరంపై పంటి గాట్లు, పలు గాయాలు ఉండటాన్ని గమనించిన విధుల్లో ఉన్న వైద్యాధికారులు ఘటనను అనుమానాస్పదంగా పరిగణించారు. వెంటనే మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. ఆసుపత్రి పోలీస్ ఔట్‌పోస్టులో కేసు నమోదు చేసి, వివరాలను అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

### అధికారులకు నోటీసులు

ఈ ఘటనపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను అందించాలని జిల్లా పోలీసు అధికారులు, ప్రభుత్వ సమగ్ర వైద్యశాల వైద్యాధికారులు, సంబంధిత ఇతర అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు పద్మలత తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్, పరిపాలన అధికారి వెల్లడించారు. బాలిక మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, అక్టోబర్ 18న పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులతో పాటు జిల్లా బాలల పరిరక్షణ అధికారి




EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## అలంపూర్ క్షేత్రంలో జోగుళాంబా సమేత బాలబ్రహ్మేశ్వర స్వామివార్లకు పట్టువస్త్రాల సమర్పణ

**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**

**రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ**

**జిల్లా ప్రజలకు దసరా శరన్నవరాత్రి శుభాకాంక్షలు**



కర్నూలు, అక్టోబర్ 17: (మహి న్యూస్): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున అలంపూర్ క్షేత్రంలో కొలువైన శ్రీ జోగుళాంబా సమేత బాలబ్రహ్మేశ్వర స్వామివార్లకు కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పట్టువస్త్రాలను సమర్పించారు. శనివారం కలెక్టర్ అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత బాలబ్రహ్మేశ్వర స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రతి ఏటా పట్టువస్త్రాలు సమర్పించే ఆనవాయితీని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారు, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి. సుధాకర్ రెడ్డి, అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఈవో దీప్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





## రెండో రోజు నామినేషన్ల జోరు..

## మేయర్‌కు 5, కార్పొరేటర్ స్థానాలకు 172 నామినేషన్లు

**రెండు రోజుల్లో మేయర్‌కు 7, కార్పొరేటర్ స్థానాలకు 185 నామినేషన్లు**

**మొత్తం 192 నామినేషన్లు దాఖలు**

**మేయర్ అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిమితి రూ.25 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థికి రూ.10 లక్షలు**



కర్నూలు, అక్టోబర్ 17: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల్లో రెండో రోజు నామినేషన్లు భారీగా దాఖలయ్యాయి. శనివారం మేయర్ పదవికి 5, కార్పొరేటర్ స్థానాలకు 172 నామినేషన్లు కలిపి మొత్తం 177 నామినేషన్లు దాఖలైనట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. రెండు రోజుల్లో కలిపి మేయర్ పదవికి 7, కార్పొరేటర్ స్థానాలకు 185 నామినేషన్లు నమోదయ్యాయని, అన్ని స్థానాలకు కలిపి మొత్తం 192 నామినేషన్లు దాఖలైనట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు, వారి ప్రతిపాదకుల పేర్లు సెప్టెంబర్ 28న ప్రచురించిన తుది ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కమిషనర్ సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతర నిఘా ఉంటుందని, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల వ్యయ పరిమితులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మేయర్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు గరిష్ఠంగా రూ.25 లక్షలు, కార్పొరేటర్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు రూ.10 లక్షల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేయాలని సూచించారు. అభ్యర్థులు రోజువారీ ఎన్నికల వ్యయ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, వ్యయ పర్యవేక్షణ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తాయని చల్లా ఓబులేసు వెల్లడించారు.

## శ్రీశైలంలో సాంస్కృతిక కార్యక్రమాలు




శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 17 : దసరా మహోత్సవముల సందర్భంగా ప్రతీరోజు సాయంత్రం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ గ్రామోత్సవంలో పలు జానపద కళకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయబడ్డాయి

**నిత్య కళారాధన వేదిక**

**క్రమసంఖ్య సమయము పేరు**

**కార్యక్రమము**

1 సాయంత్రం గం. 6.00 నుంచి రాత్రి 7.30 గంటల వరకు గాయత్రి డాన్స్ అకాడమీ, పశ్చిమగోదావరి జిల్లా వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన

2 రాత్రి గం. 7.30ల టి. బాలయోగి మరియు వారి బృందం, చీమకుర్తి, ప్రకాశం జిల్లా వారిచే భక్తి సంగీత విభావరి




**గ్రామోత్సవంలో కళారూపాలు**

నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం (సంప్రదాయ నృత్యం), విళక్కు (సంప్రదాయ నృత్యం), స్వాగత నృత్యం (సంప్రదాయ నృత్యం), కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాల ప్రదర్శన, అశ్వ ప్రదర్శన, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లన్నగ్రోవి, శంఖం, త్రిశూలం, జేగంట, కంచుడోలు, కొమ్ము, తాళాలు, చెక్కభజన , చిడతలు, శంఖం, అమ్మవారి వేషం, తప్పెట చిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలుకుణిత కన్నడ జాపద కార్యక్రమము.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు కలెక్టర్ దిశానిర్దేశం

**ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి**

**ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి**

**సమస్యలను తక్షణమే పరిష్కరించి, నివేదికలను గడువులోగా సమర్పించాలి**

**పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పటిష్ఠం చేయాలి**




కర్నూలు, అక్టోబర్ 17: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఏ పనినీ మరుసటి రోజుకు వాయిదా వేయకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శనివారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలు–2026 నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు (ఏఆర్‌ఓలు) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో ఎదురయ్యే సమస్యలను సంబంధిత నిబంధనలపై అవగాహనతో పరిష్కరించాలని, తమ పరిధిలో పరిష్కారం కాని అంశాలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు పంపాల్సిన నివేదికలను నిర్ణీత గడువులో సమర్పించేలా ప్రత్యేక అధికారిని నియమించి, రోజువారీ నివేదికలపై పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలు, తాజా సర్క్యులర్లు, ఎన్నికల మాన్యువల్స్‌ను అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పత్రాల్లోని వివరాలు, తేదీ, సమయాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, అవసరమైన సిబ్బంది, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణకు రిసెప్షన్ కేంద్రాలు, తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, సామగ్రి తరలింపునకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.



**మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పటిష్ఠం చేయాలి**

ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అనువైన భవనాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు వేర్వేరుగా ఉండేలా చూడాలని తెలిపారు. బ్యారికేడింగ్‌తో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల సిబ్బందికి అవసరమైన ఆహారం, ఇతర ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓటరు గుర్తింపు విషయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని, ఫొటో ఓటరు స్లిప్‌తో పాటు గుర్తింపు కోసం అనుమతించిన 20 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉండేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ గోప్యతను కచ్చితంగా పరిరక్షించాలని తెలిపారు. సమస్యాత్మక, క్రిటికల్ పోలింగ్



కేంద్రాల్లో అవసరాన్ని బట్టి వెబ్‌కాస్టింగ్, వీడియో గ్రాఫర్లు, మైక్రో అబ్జర్వర్లు, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను పూర్తిగా అర్థం చేసుకుని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తూ సమయపాలన, ముందస్తు సన్నద్ధత, పరస్పర సమన్వయంతో ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి, ఆర్డీవోలు ఓబులేసు, సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో ప్రశాంతంగా కొనసాగుతున్న ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

**నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు**

**రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్**




కర్నూలు, అక్టోబర్ 17: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.



ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శనివారం కర్నూలు వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేయర్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలతో పాటు గూడూరు నగర పంచాయతీ పరిధిలో రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతోందని, అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిని నిర్దేశించి బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్థులతో పాటు అనుమతి ఉన్న పరిమిత సంఖ్యలో వ్యక్తులను మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తున్నట్లు వివరించారు. ఆదివారం కూడా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల సంఘం నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తే ఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా ముగిసేందుకు రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలు జిల్లా పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు మధుసూధన్ రావు, రామయ్య నాయుడు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలి

**రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు**

**బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ఠ చర్యలు**

**ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు**

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, అక్టోబర్ 17: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేసినట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం నగర శివారులోని అథెనా స్కూల్‌లో చేపడుతున్న ఏర్పాట్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వారి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిస్టర్ ఇడ్లీ హోటల్ వైపు నుంచి కౌంటింగ్ కేంద్రానికి చేరుకుని, అథెనా స్కూల్ నుంచి బాలాజీ విల్లాస్ మీదుగా తిరిగి వెళ్లేలా మార్గాలను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం అవసరమైన అనుబంధ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం సమీపంలో ప్రత్యేక స్థలాలను గుర్తించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కిటికీలు మూసివేయడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం, బ్యాలెట్ బాక్సుల భద్రపరిచే ప్రదేశాలను గుర్తించడం, సంఖ్యా గుర్తింపులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం వంటి పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. పోలింగ్ రోజున బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల పత్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో పంపిణీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్దన్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.





EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
వై ఎస్ ఆర్ కడప జిల్లా
ఆదివారం - 18 - అక్టోబర్ - 2026

# నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..!

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు



కడప, మహి న్యూస్ అక్టోబర్ 17: వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ఆఅమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో గుంపులుగా చేరకుండా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ కేంద్రాల వద్ద అమలు చేయాల్సిన ఆంక్షలపై ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# రాయచోటిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు..

# సంయమనం పాటించాలి: గండికోట సుధాకర్



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 17: ప్రశాంతంగా ఉన్న రాయచోటి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ ఆరోపించారు. నిన్న జరిగిన సంఘటనను ప్రస్తావిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకముందే వైసీపీ శ్రేణులు ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన అవసరం ఉందని గండికోట సుధాకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మస్తాన్ వల్లి, గుర్రం సుబ్బయ్య నాయుడు, రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లాలో ప్రజారోగ్య సంచాలకుడి ఆకస్మిక తనిఖీ

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష



కడప, అక్టోబర్ 17, (మహి న్యూస్): ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ వెంకట రమణ అక్టోబర్ 17న కడప జిల్లాలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా కార్యక్రమ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల వివరాలను సంచాలకుడికి వివరించారు. అనంతరం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వారీగా నివేదికలను పరిశీలించిన ప్రజారోగ్య సంచాలకుడు వివిధ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, హెచ్‌పీవీ టీకాల పంపిణీ, పాఠశాల ఆరోగ్య కార్యక్రమాలు, ఉచిత కంటి పరీక్షలు, ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును సమీక్షించి, వాటి పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ అధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మహమ్మద్ తాహా, డాక్టర్ మాధవీలత, డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డెమో భారతి, రమేష్ రెడ్డి, డీఎస్ఓ ప్రసన్నలత, డిప్యూటీ డెమోతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భూపేష్ సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు

## జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో కేక్ కటింగ్



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 17: కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి జన్మదినం సందర్భంగా జమ్మలమడుగులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర న్యాయ విభాగం ప్రధాన కార్యదర్శి సూర్య పెద్దిరాజు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మల్లికార్జున, తిరుమల దాస్, సునీల్ కుమార్ రెడ్డి, సాయి, హనుమంతు నాయక్, ఓబుల్ రెడ్డి, నరసింహారెడ్డి, మాధవరెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు గడువు పొడిగింపు..!

## అక్టోబర్ 22 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం..

మదనపల్లె/కడప, మహి న్యూస్, అక్టోబర్ 17: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 22 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నోటీసుల ప్రక్రియ కూడా అక్టోబర్ 22 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిశాంత్ కుమార్, ఐఏఎస్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నిక అధికారి.

# నెల 22వ తేదీలోగా స్మార్ట్ కిచెన్ల విస్తరణ పనులు పూర్తి చేయాలి..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశం

## ఒక లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా సిద్ధం అవ్వాలి



కడప, మహి న్యూస్ అక్టోబర్ 17: జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు చేపట్టిన స్మార్ట్ కిచెన్ల విస్తరణకు సంబంధించి పెండింగ్‌బి పనులన్నింటినీ ఈ నెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సంబంధిత శాఖల



అధికారులతో పాటు ఆయా మండలాల ఎంఈవోలతో వీసీ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో స్మార్ట్ కిచెన్ల నిర్వహణ, పాఠశాలల అనుసంధానం, ఆహార సరఫరా మార్గాలు, మౌలిక సదుపాయాలు, ఇతర పెండింగ్ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి విద్యార్థికి నిర్ణీత సమయానికి వేడివేడి ఆహారం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ లోపు జిల్లా వ్యాప్తంగా 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇంకా స్మార్ట్ కిచెన్ల పరిధిలోకి తీసుకురావాల్సిన 369 పాఠశాలలకు అనుసంధాన ప్రక్రియ, రవాణా మార్గాల గుర్తింపును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆహార సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న పాఠశాలలకు సంబంధించి రవాణా సమయాలను పునఃపరిశీలించి, సరఫరా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. స్మార్ట్ కిచెన్లలో వాహనాల స్టాండింగ్ షెడ్లు, వాహనాల నిలుపుదల వేదికలు, రక్షణ కంచెల నిర్మాణం వంటి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, శుద్ధి చేసిన తాగునీటి వ్యవస్థలు, బోరుబావులు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వంటశాలల్లో ఏర్పాటు చేసిన బయో వ్యర్థాల శుద్ధి పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. వంటశాలలకు అవసరమైన కూరగాయలు, ఇతర వంట సరుకులను ముందస్తు ప్రణాళికతో సేకరించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీప కొనుగోలు కేంద్రాలను గుర్తించాలని సూచించారు. విద్యార్థుల నమోదు సంఖ్య తక్కువగా ఉన్న 13 ప్రాధాన్య ప్రాంతాల్లో వంటశాలల అవసరాలకు అనుగుణంగా కూరగాయల తోటలను ఏర్పాటు చేయాలన్నారు. మండలాల వారీగా ఖాళీలను పరిశీలించి అర్హులైన పాఠశాల వంట సహాయకులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విబిజీ రామ్ జీ, ఉద్యాన శాఖ, ఏపీఎంఐపి శాఖల సమన్వయంతో.. ఆయా పాఠశాలల పరిధిలో న్యూట్రీ కిచెన్ గార్డెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మొత్తం 38 స్మార్ట్ కిచెన్లలో ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, పరిసరాల శుభ్రత విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో శంశుద్దీన్,



ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, స్మార్ట్ కిచెన్ల నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, ఏపీ సీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, పౌర సరఫరాలు, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత..!

## జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

## పులివెందుల ఘటనలో పరిస్థితిని అదుపులోకి తెచ్చాం..





కడప జిల్లా/పులివెందుల, అక్టోబర్ 17: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని, నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘించి గుంపులుగా వచ్చే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, డీఐజీ కోయ ప్రవీణ్ తో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. నామినేషన్ల రెండో రోజు శుభదినం కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చారని ఎస్పీ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రద్దీ ఏర్పడినప్పటికీ, ఒకటి రెండు ఘటనలు మినహా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని పేర్కొన్నారు. కడప జిల్లాలో శుక్రవారం నుంచే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ శనివారం కూడా ఆదేశాలు జారీ చేశారని, ఈ నిబంధనలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ముందుగానే సమాచారం అందించామని వివరించారు. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా నిబంధనలను తెలియజేశామని చెప్పారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించడంతో పాటు శాంతిభద్రతలను కాపాడటమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు తమ వెంట పరిమిత సంఖ్యలో వ్యక్తులను మాత్రమే తీసుకురావాలని, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల పరిధిలో నిర్ణయించిన వాహన పరిమితులను పాటించాలని సూచించారు. గుంపులుగా చేరడం, ఊరేగింపులుగా రావడం నిబంధనలకు విరుద్ధమని, ఆంక్షలను తప్పనిసరిగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. పులివెందులలో సుమారు 500 మంది ఒకేచోట చేరి నామినేషన్ కేంద్రానికి వెళ్లేందుకు ప్రయత్నించారని ఎస్పీ తెలిపారు. వారిని గుంపులుగా వెళ్లవద్దని, అభ్యర్థులు మాత్రమే నిబంధనల ప్రకారం రావాలని పోలీసులు పలుమార్లు హెచ్చరించి, నచ్చజెప్పారని వివరించారు. అయినప్పటికీ కొందరు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం చేపట్టామని తెలిపారు. రాళ్లదాడి కొనసాగడంతో కొన్ని రౌండ్లు గాలిలో కాల్పులు జరిపినట్లు వెల్లడించారు. అవసరమైన మేరకే బలప్రయోగం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఆదివారం కూడా సెక్షన్ 163 కింద ఆంక్షలు అమల్లో ఉంటాయని, నామినేషన్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో గుమిగూడడం, ఊరేగింపులుగా రావడం అనుమతించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో స్వతంత్ర అభ్యర్థులతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులందరికీ నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు పోలీసు శాఖ సహకరిస్తుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమగ్ర వ్యవసాయ ప్రణాళిక

## 365 రోజులూ భూమిపై పచ్చదనం ఉండేలా పంటల ప్రణాళిక

## బీడు భూములను సాగులోకి తీసుకురావాలి

## రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి



నంద్యాల, అక్టోబర్ 17: (మహి న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ సూచించారు. ఏడాది పొడవునా భూమిపై పచ్చదనం ఉండేలా పంటల ప్రణాళిక రూపొందించాలని, బీడు భూములను సాగులోకి తీసుకురావాలని తెలిపారు. శనివారం నంద్యాల పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారి నాగరాజుతో కలిసి వ్యవసాయ, ఉద్యాన రంగాల పురోగతి, ప్రకృతి వ్యవసాయ విస్తరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూపొందించిన సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

### 365 రోజులూ పచ్చదనం ఉండేలా పంటల ప్రణాళిక

వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలని విజయ్ కుమార్ సూచించారు. కంది, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, మిరప వంటి ప్రధాన పంటల్లో పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. భూమి ఉత్పాదకతను కాపాడుతూ సాగు కొనసాగించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. జూన్ 2027 వరకు నిర్దేశించిన వ్యవసాయ లక్ష్యాలను సాధించేలా పంటల ఎంపిక, సాగు విధానాలు, నీటి వినియోగంపై రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. మామిడి తోటల్లో అంతర పంటలు, బహుళ పంటల సాగును ప్రోత్సహించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా అవసరమైన సమాచారాన్ని అందించాలని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే జీవ ఉత్ప్రేరకాలు, ఇతర జీవ ఆధారిత ఉత్పత్తులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



### ప్రకృతి వ్యవసాయంలో నంద్యాల జిల్లా పురోగతి

నంద్యాల జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఆశాజనకంగా అమలవుతోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జిల్లెల్లలోని మణికంఠ బీఆర్సీ, గుండుపాపలలోని షణ్ముఖ బీఆర్సీ కేంద్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు జీవ ఉత్ప్రేరకాలు అందించడంలో ఈ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అభినందించారు. 2026-27 వ్యవసాయ లక్ష్యాలను సాధించేందుకు వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని కలెక్టర్ తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, నాణ్యమైన జీవ ఉత్ప్రేరకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### క్షేత్రస్థాయిలో జీవ ఉత్ప్రేరకాలు అందుబాటులో ఉంచాలి

అనంతరం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన సమీక్షలో విజయ్ కుమార్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో నాణ్యమైన జీవ ఉత్ప్రేరకాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు అందిస్తూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ, సమాజానికి అన్నం అందించే రైతులే నిజమైన హీరోలని పేర్కొన్నారు. ఎల్‌నినో కారణంగా నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులను ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అవకాశంగా మలుచుకోవాలని సూచించారు. వినూత్న పద్ధతుల్లో సాగు చేసే రైతుల అనుభవాలను ఇతర రైతులకు పరిచయం చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యాంకర్ జలాల్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై. శ్రీనివాసులు, అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ సలాం, ఎన్ఎఫ్ఏలు, ఎఫ్ఎంటీలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com